దారెంట.. దీపాల ముచ్చట



ఖమ్మం-సూర్యాపేట ప్రధాన రహదారిపై పాలేరు సమీపంలోని వంతెనలపై మిరుమిట్లు గొలుపుతున్న ఎల్ఈడీ దీపాల కాంతులివి. వాహనదారులు ఈ దృశ్యాన్ని ఫోన్‌లలో బంధించుకుని మురిసిపోతున్నారు.
– ఈనాడు, ఖమ్మం

19 లోగా దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇతర తాత్కాలిక పోస్టులకు ఈనెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రాజేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తులను పంపవచ్చన్నారు. 21న ముఖాముఖి ఉటుందని, వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

నేడు 'సీఎం కప్' క్రీడాజ్యోతి రాక



ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: సీఎం కప్ క్రీడా జ్యోతి మంగళవారం జిల్లాలోకి ప్రవేశించనుంది. ప్రదర్శనకు స్థానిక అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. క్రీడా జ్యోతితో వస్తున్న వాహన శ్రేణి, క్రీడాకారుల బృందం ఉదయం 10 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం నుంచి ఏన్కూరు మండలంలోని ఇమాంనగర్‌లోకి ప్రవేశిస్తుంది. అక్కడ్నుంచి కొణిజర్ల మండలం మీదుగా ఖమ్మం స్టేడియానికి బృందం సభ్యులు చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటలకు సర్దార్ పటేల్ స్టేడియం నుంచి ట్యాంక్‌బండ్ వరకు పరుగు ఏర్పాటు చేశారు. 16న ఉదయం ఖమ్మం గ్రామీణం మండలం ఏదులాపురం మీదుగా సుబ్లేడ్ క్రాస్‌రోడ్డుకి చేరి.. అక్కడ్నుంచి మరో జిల్లాలోకి క్రీడాజ్యోతి ప్రవేశిస్తుంది. విద్యార్థులు, క్రీడాకారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి కోరారు. ర్యాలీలో పాల్గొంటున్న బృందంలో ప్రభుత్వ క్రీడా అకాడమీలకు చెందిన 25 మంది క్రీడాకారులుండగా.. వీరిలో పది మంది ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీకి చెందిన వారే ఉండటం విశేషం.

కొత్తగా 5 పోలింగ్ కేంద్రాలు



ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: జిల్లాలో కొత్తగా 5 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పొడిశెట్టి శ్రీజ తెలిపారు. 'ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ - 2025'పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సత్తుపల్లిలో 3, పాలేరులో 2 కేంద్రాలు కొత్తగా ప్రతిపాదించి ఎన్నికల సంఘానికి పంపుతున్నట్లు వివరించారు. ఓటర్ల జాబితా తయారీకి పార్టీలు సహకరించాలని కోరారు. ఈనెల 29న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటిస్తామని చెప్పారు. ఓటు నమోదు, మార్పులు, తొలగింపులకు నవంబరు 28 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అభ్యంతరాలను డిసెంబరు 24 వరకు పరిష్కరిస్తామని తెలిపారు. వచ్చేఏడాది జనవరి 6న తుది జాబితా ప్రకటిస్తామన్నారు. సమావేశంలో పార్టీల ప్రతినిధులు శ్రీనివాస్, రాజేశ్, గోపాల్, ఫ్రాన్సిస్, ప్రకాశ్, ఎన్నికల విభాగం డీటీ అన్సారీ పాల్గొన్నారు.

'భక్తరామదాసు' వెట్‌రన్ విజయవంతం



ఎస్సారెస్పీ కాలువకు చేరుతున్న జలాలు

కూసుమంచి, న్యూస్‌టుడే: మండలంలోని భక్తరామదాసు ఎత్తిపోతల పథకం మోటారు వెట్‌రన్ ప్రక్రియ విజయవంతమైంది. సోమవారం మోటారును ఆన్ చేసి పరీక్షించగా పూర్తి స్థాయిలో పనితీరు కనబర్చింది. గత నెల 1న పాలేరు వరద పోటెత్తిన నేపథ్యంలో భక్తరామదాసు ఎత్తిపోతల పంప్‌హౌస్ నీట మునిగిన విషయం తెలిసిందే. పంప్‌హౌస్‌లోని రెండు భారీ మోటార్లు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. నీటి తొలగింపు అనంతరం నెల రోజులపాటు డ్రై చేశారు. ఇటీవల డ్రైరన్ నిర్వహించగా ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకపోవడంతో అధికారులు డ్రై రన్ నిర్వహించారు. 2,500 అశ్విక శక్తి కలిగిన మోటారు పాలేరు జలాశయం నుంచి 275 క్యూసెక్కుల నీటిని ఎస్సారెస్పీ కాలువకు ఎత్తిపోసింది. దీంతో మోటారు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చినట్లు ఇంజినీర్లు గుర్తించారు. రెండో మోటారుకూ కొద్ది రోజుల్లో డ్రైరన్ నిర్వహిస్తామని డీఈఈ రమేశ్‌రెడ్డి తెలిపారు. ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

పశువైద్యులొచ్చే..!



ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ పరిధిలో ఎంపికైన 171 మంది వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(ఏవీఎస్)లకు ఇటీవల అదనపు సంచాలకురాలు మల్లేశ్వరి నియామక పత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. దీంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఖాళీలు భర్తీ అయ్యే అవకాశం ఏర్పడింది. పదేళ్లుగా నియామకాలు లేకపోవటంతో పశు సంవర్ధకశాఖలో ముఖ్యమైన ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు సరైన వైద్యం అందటం లేదు.

జిల్లాలో ఎర్రుపాలెం, వేంసూరు, కల్లూరు, తల్లాడ, సత్తుపల్లి, సింగరేణి లాంటి మండల కేంద్రాల్లోనే పశువైద్యులు లేరు. పక్కనున్న వైద్యులకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించి నెట్టుకొస్తున్నారు. 18 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తల్లాడ మండలంలోని తల్లాడ, కుర్నవల్లి, మధిర మండలంలోని సిరిపురం, కంభంపాడు, సత్తుపల్లి మండలంలోని సత్తుపల్లి, కాకర్లపల్లి, కిష్టారం, బేతుపల్లి గంగారం, కల్లూరు, సింగరేణి, వేంసూరు, బనిగండ్లపాడు, ఎర్రుపాలెం, తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు, వైరా మండలంలోని పాలడుగు, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రంలో రెండు పశువైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని కొత్త వైద్యులతో భర్తీ చేసే అవకాశం ఉంది. భద్రాద్రి జిల్లాలో... 22 మండలాలు ఉండగా 14 మండలాలకు పశువైద్యులు లేరు. మొత్తం 22 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొత్త నియామకాల్లో వీరిని కేటాయిస్తేనే సమస్య తీరే అవకాశం ఉంది.

ఆకాశమే హద్దురా..!



పాల్వంచ పట్టణం, మధిర పట్టణం, న్యూస్‌టుడే



"కష్టాలు నిన్ను నాశనం చేయడానికి రాలేదు. నీ శక్తి సామర్థ్యాలను వెలికితీసి నిన్ను నీవు నిరూపించుకోడానికి వచ్చాయి. కష్టాలకు కూడా తెలియాలి.. నిన్ను సాధించడం కష్టమని"
- ఏపీజే అబ్దుల్ కలాం

మిస్సైల్ మ్యాన్, మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా నేడు అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ఆ మహనీయుడి జీవితం నేటి విద్యార్థి, యువ లోకానికి ఎంతో ప్రేరణ ఇస్తుంది. కలాం స్ఫూర్తితో ఎందరో ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారు. 'మీ ప్రయత్నం లేకపోతే మీకు విజయం రాదు.. కానీ, మీరు ప్రయత్నిస్తే ఓటమి మాత్రం రాదు' అని ఆయన అన్నారు. మారుమూల గురుకులాల్లో చదివిన వారు, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు ఈ మాటలే ప్రేరణగా విదేశీ విద్యనభ్యసించే స్థాయికి ఎదిగారు. విద్యతో నాస్తి దుర్భిక్షం అని నిరూపించారు. ఎంతో మంది విదేశాల్లో స్థిరపడి తమలాంటి పేద, మధ్య తరగతి వారికి దిశా నిర్దేశం చేస్తున్నారు. విద్య, విజ్ఞానార్జనలో ఆకాశమే హద్దురా అని చాటుతున్నారు. విదేశాల్లో విద్యార్థులుగా, వారికి వారధులుగా సహకరిస్తున్న ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురిని 'న్యూస్‌టుడే' పలకరించింది.

పేద విద్యార్థులకు అండగా నిలుస్తా..



- దుగ్గినేని నవ్యంత్, వాషింగ్టన్ డీసీ

మధిర మండలం ఇల్లూరుకు చెందిన నేను.. అమెరికాలో చదవాలని చిన్ననాటి నుంచే కల కనేవాణ్ని. అబ్దుల్ కలాం అన్నట్టు.. 'కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి' అనే స్ఫూర్తితో, ఒక లక్ష్యంతో చదువు కొనసాగించా. గ్రామీణ ప్రాంతమే అని భయపడలేదు. ఉమ్మడి జిల్లాకు చెందిన వారెందరో అంతర్జాతీయంగా వివిధ దేశాల్లో చదువుకుని ఉన్నతోద్యోగాల్లో స్థిరపడ్డారు. నేనూ రాణించలననే ఆత్మవిశ్వాసంతో వాషింగ్టన్ డీసీ (యూఎస్ఏ)లోని జార్జ్ మాసన్ వర్సిటీలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తి చేశాను. ప్రస్తుతం ఏడాదిగా గ్రాడ్యుయేట్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. మరింత ఉన్నతస్థాయికి చేరడంతో పాటు పేద విద్యార్థులకు అండగా నిలవడమే నా లక్ష్యం.

మా వంతు సహకారం అందిస్తాం..



కొట్టె రామారావు, మెకానికల్ ఇంజినీర్, దక్షిణాఫ్రికా

మాది భద్రాచలం. ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పాల్వంచ గురుకుల (సీవోఈ) కళాశాలలో విద్యనభ్యసించా. బీటెక్ (మెకానికల్) చదివిన తర్వాత తగిన నైపుణ్యాలు సాధించి విదేశాల్లో స్థిరపడాలనేది నా కల. ఎల్‌అండ్‌టీ బాయిలర్ ఇంజినీర్‌గా పాల్వంచ కేటీపీఎస్‌లో విధులు నిర్వహించా. నా సామర్థ్యం గుర్తించిన యాజమాన్యం పవర్ కంపెనీ బాయిలర్ మేనేజర్‌గా పదోన్నతిపై దక్షిణాఫ్రికా పంపించింది. మంచి వేతనంతో గత పన్నెండేళ్లుగా ఉద్యోగం కొనసాగిస్తున్నా. అంతర్జాతీయంగా విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులకు ఈ దేశంలో గతంలో కంటే మెరుగైన అవకాశాలున్నాయి. ఉమ్మడి ఖమ్మం విద్యార్థులకు మావంతు ప్రోత్సాహం అందిస్తున్నాం.

గ్రామీణ ప్రాంత విద్యాభివృద్ధికి కృషిచేస్తా..



రావూరి యశ్వంతి, డేటా ఎనలిస్ట్, ఒహియో, యూఎస్ఏ

నేను యూఎస్ఏ ఒహియో రాష్ట్రంలోని సిన్సినాటి విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ (కంప్యూటర్ సైన్స్) పూర్తిచేశాను. నా విద్యాభ్యాసం కోసం అమ్మానాన్నలు ఎంతో కష్టపడ్డారు. మా స్వగ్రామం మధిర మండలం మాటూరుపేట. విదేశాల్లో చదవాలనే కోరిక బలంగా ఉండేది. సిన్సినాటి వర్సిటీలో రెండేళ్ల క్రితం విద్య పూర్తవగానే 'కేర్ సోర్స్ డైటన్' కంపెనీలో డేటా ఎనలిస్ట్‌గా చేరా. మా గ్రామీణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి కృషిచేయడమే లక్ష్యం.

ఉద్యోగం చేస్తూనే.. నైపుణ్యాలు అందిపుచ్చుకుని..



- టి.రవి, కాస్మొటిక్ కంపెనీ మేనేజర్, టాంజానియా

పాత పాల్వంచకు చెందిన నేను స్థానిక సాంఘిక గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ వరకు చదివా. ఎంటెక్ తర్వాత విదేశాల్లో స్థిరపడాలనుకున్నా. తొలుత ఎల్‌అండ్‌టీ కంపెనీలో చేరా. సంస్థ తరఫున పాల్వంచలో కేటీపీఎస్ నిర్మాణ పనుల్లో పనిచేశా. ఇదే క్రమంలో విదేశాల్లో విధుల్లో రాణించేందుకు కావాల్సిన నైపుణ్యాల్ని కొందరు ఎన్నారై మిత్రుల సహకారంతో సంపాదించుకున్నా. 2011లో తూర్పు ఆఫ్రికాలోని టాంజానియాలోని కాస్మొటిక్ ఇండస్ట్రీలో మేనేజర్‌గా పనిచేసే అవకాశం దక్కింది. ఉన్నత చదువులు చదివిన విద్యార్థులకు ఈ దేశంలో పుష్కలమైన అవకాశాలున్నాయి. సూచనలు, సలహాలకై ఎవరు సంప్రదించినా సహకరిస్తాం.

ధాన్యం నిల్వలకు సంసిద్ధం



'న్యూస్‌టుడే'తో గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు

వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి నిల్వ చేసేందుకు గిడ్డంగుల సంస్థ గోదాములు సిద్ధంగా ఉన్నాయని ఆ సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. ఈసీజన్‌లో సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించకుండా, ప్రభుత్వ శాఖలు, సంస్థల పరిధిలోని గోదాముల్లోనే నిల్వ ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో గిడ్డంగుల సంస్థ సంసిద్ధతపై 'న్యూస్‌టుడే'తో ఆయన ముచ్చటించారు. ఆ వివరాలు మీ కోసం..

మిల్లర్లకు గోదాముల సౌకర్యం తక్కువ

మిల్లర్లకు గోదాముల సౌకర్యం తక్కువగా ఉంటుంది. ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని ఆరు బయటే ఉంచుతున్నారు. ధాన్యం తడిచి, పాడై నష్టం ఎక్కువ జరుగుతోంది. రానున్న రోజుల్లో పేదలకు నాణ్యమైన సన్నబియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకే ప్రభుత్వ శాఖలు, సంస్థల పరిధిలోని గోదాముల్లోనే ధాన్యం నిల్వ ఉంచాలని ఆదేశించింది.

ఉభయ జిల్లాల్లో 5.10 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం

ఖమ్మం, కొత్తగూడెం, పాల్వంచలో గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో గోదాములు ఉన్నాయి. వీటిలో 3.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేయవచ్చు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోతమ సంస్థ నిర్వాహణలోనే వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములు, మార్క్‌ఫెడ్ గోదాములు, ప్రైవేటు గోదాములు 20 వరకు ఉన్నాయి. వీటి సామర్థ్యం 1.50 లక్షల మెట్రిక్ టన్నులు. వీటిలో ధాన్యం తడవకుండా నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. మిల్లర్ల కేటాయింపుల మేరకు ఎప్పటికప్పుడు గోదాముల నుంచి మిల్లులకు తరలించవచ్చు.

కూసుమంచి, న్యూస్‌టుడే

కొలువెక్కడో తేలేది నేడే..

కొత్త ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్.. రేపు బాధ్యతల్లోకి..

ఖమ్మం విద్యా విభాగం, న్యూస్‌టుడే

'డీఎస్సీ-2024' విజేతల ఏళ్లనాటి కలనెరవేరనుంది. కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టే తరుణం రానేవచ్చింది. ప్రతి ఉద్యోగికి తొలి పోస్టింగ్ ఓ విశేషమే. వారు పనిచేసిన మొట్టమొదటి ప్రాంతం జీవితంలో ఓ జ్ఞాపకంగా మిగిలిపోతుంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని నూతనోపాధ్యాయులు ఉత్సుకతతో ఎదురు చూస్తున్నారు. పోస్టింగ్ కేటాయింపునకు ఒకరోజు కౌన్సెలింగ్ నేడు జరగనుంది. కేటాయించిన విద్యాలయంలో 16 నుంచి బోధన చేపట్టనున్నారు.

జిల్లాలో మొత్తం 575కి గాను 520 పోస్టులు భర్తీ కానున్నాయి. ఇప్పటికే జిల్లా విద్యాశాఖకు రిపోర్టింగ్ చేసిన వారికి నేడు ఖమ్మం టేకులపల్లిలోని డైట్ కళాశాలలో పాఠశాలల కేటాయింపునకు ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియను జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ పర్యవేక్షిస్తారు. కార్యాలయ సిబ్బందితో పాటు అన్ని మండలాల ఎంఈవోలు అందుబాటులో ఉంటారు. జిల్లాలో ప్రత్యేక విద్య సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్‌కు సంబంధించి మరో 37 పోస్టుల భర్తీపై ఉత్కంఠ కొనసాగుతోంది. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ ఈ ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. తుది నిర్ణయం కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.



భద్రాద్రి డీఈఓ కార్యాలయంలో కొత్త ఉపాధ్యాయులు..

జిల్లాలో కేవలం సర్దుబాటు ఆధారంగా కొనసాగుతున్న సుమారు 20 బడులకు ఏకోపాధ్యాయులు సమకూరనున్నారు. ఇటీవల బదిలీల అనంతరం 70 శాతం పోస్టులతో కొనసాగుతున్న ఉన్నత పాఠశాలల్లోనూ మిగతా సబ్జెక్టు ఉపాధ్యాయులు నియమితులు కానున్నారు.

★ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 447కి గాను 413 పోస్టులు భర్తీ కానున్నాయి. పాత కొత్తగూడెం ఆనంద ఖని జిల్లా విద్యా కేంద్రంలో ఈ-కౌన్సెలింగ్ జరుగుతుంది. కొత్త టీచర్లందరికీ ఈ నెల 10వ తేదీ నుంచే వేతన భత్యాలను వర్తింపజేయనున్నారు. వీరి రాకతో ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలోని 600 ప్రాథమిక పాఠశాలలు బలోపేతం కానున్నాయి.

అప్పీళ్లను పరిశీలిస్తాం..

సోమశేఖర్‌శర్మ, డీఈఓ

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నాం. ఇటీవల జిల్లా కార్యాలయంలో రిపోర్టింగ్ చేసిన వారికి మంగళవారం ఈ-కౌన్సెలింగ్ చేపడుతున్నాం. కేటాయించిన బడుల్లో మరుసటి రోజే చేరాల్సి ఉంటుంది. జిల్లాలో ఒకరిద్దరు అభ్యర్థుల ఎంపికపై కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇలాంటి వాటిని రాత పూర్వకంగా తెలియజేస్తే డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు: తుమ్మల



రజబ్‌అలీ నగర్‌లో మురుగు కాల్వ దుస్థితిపై నిలదీస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రఘునాథపాలెం మండలంలోని పంగిడి, ఎన్వీ బంజర, రజబ్‌అలీ నగర్ గ్రామాల్లో సోమవారం సాయంత్రం పర్యటించారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.17.50 లక్షలతో రజబ్‌అలీనగర్‌లో చేపట్టనున్న సీసీ రహదారులు, మురుగు కాల్వలు, రూ.30 లక్షలతో ఎన్వీ బంజరలో, రూ.87 లక్షలతో పంగిడిలో చేపట్టనున్న సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. గుడిసెలు, రేకుల షెడ్లలో ఉంటున్న వారి వివరాలు అందిస్తే వారి అర్హత మేరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మండలంలో పోడు పట్టాలు పొందిన గిరిజన రైతుల పొలాల్లో బోర్లకు విద్యుత్తు కనెక్షన్లు మంజూరు చేయాలని మంత్రి గిరిజన శాఖ ఉన్నతాధికారులను కోరారు. సర్వే జరిగి మిగిలిన పోడు భూముల పంపిణీకి చర్యలు తీసుకోవాలని చరవాణిలో ఆదేశించారు. ఎన్వీ బంజరలో అవసరమైన అదనపు విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్తు అధికారులకు సూచించారు. ఆయన వెంట రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాయకులు మానుకొండ రాధాకిశోర్, సాధు రమేశ్ రెడ్డి, మలీదు జగన్, భూక్యా లాలు, పీఆర్ డీఈ మహేశ్‌బాబు, ఏఈ చిరంజీవి ఉన్నారు.

ముగింపు దశకు కట్ట ఎత్తు పెంపు పనులు

కూసుమంచి, న్యూస్‌టుడే: పాలేరు జలాశయానికి అనుసంధానంగా ఉండే విద్యుదుత్పత్తి కేంద్రం ప్రత్యేక కాలువ కట్ట పటిష్ఠత పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. గత నెల 1న పాలేరు జలాశయానికి వరద పోటెత్తిన నేపథ్యంలో 23 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టం కలిగిన జలాశయం 32 అడుగులకు చేరింది. దీంతో విద్యుత్తు కేంద్రం సమీపంలో 28 అడుగుల ఎత్తు ఉన్న ప్రత్యేక కాల్వ కట్టపై నుంచి నాలుగు అడుగుల మేర నీరు ప్రవహించడంతో గండిపడిన విషయం తెలిసిందే. గండి పడ్డ ప్రాంతంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. నిబంధనల ప్రకారం జెన్‌కో ఆధ్వర్యంలో పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఆ శాఖ నుంచి తక్షణ స్పందన కొరవడటంతో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా మూడు రోజుల క్రితం జలవనరుల శాఖ అధికారులు కట్ట ఎత్తు పనులకు శ్రీకారం చుట్టారు. మరో మూడు రోజుల్లో పనులు పూర్తవుతాయని ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు తెలిపారు.



కొనసాగుతున్న కట్ట పటిష్ఠత పనులు

విద్యుత్తు అధికారులు, సిబ్బంది బదిలీ



అర్బన్ సెక్షన్‌లో బాధ్యతలు చేపడుతున్న సీనియర్ లైన్‌మెన్ సత్యనారాయణరెడ్డి

ఖమ్మం రోటరీనగర్, న్యూస్‌టుడే: టీజీ ఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ పరిధిలో బదిలీలు పూర్తయ్యాయి. సీఎండీ ఆదేశాలతో ఈ నెల 11న అర్ధరాత్రికల్లా ఈ ప్రక్రియ పూర్తి చేశారు. ఏడీఈలు 10, ఏఈలు 44, సబ్ ఇంజినీర్లు 28, జేఏఓలు 21, సీనియర్ అసిస్టెంట్లు 22, జూనియర్ అసిస్టెంట్లు 8, రికార్డు అసిస్టెంట్లు 3, ఆఫీస్ సబార్డినేట్లు 11, ఫోర్‌మెన్లు 8, ఎస్ఎల్ఐలు 16 మంది కలిపి మొత్తం 171 మందికి ఎస్ఈ ఎ.సురేందర్ బదిలీ చేశారు. లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్ల బదిలీలను డీఈలు పూర్తిచేశారు. నగర పరిసరాల్లోని వారు తక్షణం, ఇతర ప్రాంతాల్లోని వారు మంగళవారం(15వ తేదీ)లోపు బాధ్యతలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు.

2 కిలోమీటర్లు 200 గుంతలు!

–కొణిజర్ల, న్యూస్‌టుడే

ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ రాష్ట్రీయ రహదారి నుంచే ప్రయాణిస్తుంటారు.. కానీ, 2 కి.మీ.కు 200 గుంతలు ఉన్నాయంటే ప్రయాణం ఎంత నరకప్రాయమో అర్థం చేసుకోవచ్చు. ఖమ్మం-అశ్వారావుపేట రాష్ట్రీయ రహదారిలో కొణిజర్ల-పల్లిపాడు మధ్య రెండు కి.మీ దూరం అత్యంత ప్రమాదకరంగా తయారైంది. గుంతలను తప్పించే ప్రయత్నంలో వాహనాలు అదుపుతప్పుతున్నాయి. రహదారి పక్కనున్న చెట్లను ఢీకొంటున్నాయి. అంచులు చూడా కోతకు గురవడంతో పొలాల్లోకి దూసుకువెళ్తున్నాయి. ప్రమాదాల నియంత్రణకు ఇప్పటికీ చర్యలనేవే లేవు.



← ఇటీవల మినీ బస్సు ప్రమాదానికి కారణమైన గుంత

"ఇటీవల ఆర్అండ్‌బీ అధికారులు గుంతలు పడిన విషయాన్ని మా దృష్టికి తీసుకొచ్చారు. రెండు రోజుల్లో గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపడతాం." అని హైవే అధికారి దివ్య 'న్యూస్‌టుడే'తో అన్నారు.

ఇవీ ఉదాహరణలు..

- ఇటీవల కరీంనగర్‌కు చెందిన మినీ బస్సు అన్నవరం వెళ్లి వస్తూ గుంతలో పడి రహదారి పక్కకు దూసుకుపోయింది.
- సత్తుపల్లి వెళ్తున్న కారు వేగంగా వచ్చి గుంత కనపడటంతో డ్రైవర్ సడన్‌బ్రేక్ వేశాడు. వెనకనే వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి కారును ఢీకొంది. ఇద్దరికి గాయాలయ్యాయి
- ఏపీకి చెందిన ఓ కారు టైరు గుంత కారణంగా పంక్చరైంది. మధ్యలోనే అది ఆగిపోవడంతో.. పక్కకు తీయడానికి నానా అవస్థలు పడ్డారు.
- రెణ్నెల్ల క్రితం గుంతలను తప్పించబోయిన ఓ ద్విచక్రవాహనం ఎదురుగా వచ్చిన లారీని ఢీకొంది. దీంతో రఘునాథపాలెంకు చెందిన యువకుడు మృతిచెందాడు.
- రహదారి పక్కనున్న చెట్టును కారు ఢీకొన్న మరో ఘటనలో వైరాకు చెందిన నలుగురు ఆసుపత్రిపాలయ్యారు.

సాగు మారింది.. రాబడి పెరిగింది

మూస సాగు పద్ధతులకు స్వస్తిచెప్పి శాస్త్రవేత్తల సూచనలతో ఓ రైతు లాభాల బాట పట్టాడు. కూసుమంచి మండలం కేశవాపురం గ్రామానికి చెందిన **మల్లేపల్లి అప్పారావు** సంప్రదాయ విధానంలో పత్తి సాగు చేస్తుండేవారు. వైరా కేవీకే శాస్త్రవేత్తల



సూచనలతో గతేడాది అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేపట్టారు. సాధారణ పద్ధతిలో ఎకరానికి 4,900 పత్తి విత్తనాలు మాత్రమే నాటగా అధిక సాంద్రత విధానంలో ఎకరాకు 29,629 నాటారు. విత్తనాలు నాటడంలో శాస్త్రవేత్తలు నిర్దేశించిన ప్రమాణాలను ఆయన పాటించారు. దీంతోపాటు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. పంట కాల పరిమితి సాధారణంకంటే ముందే నవంబరులోనే ముగిసింది. సాధారణ పద్ధతిలో ఎకరానికి రూ.18,050 ఆదాయం, 8 క్వింటాళ్ల దిగుబడి రాగా అధిక సాంద్రత విధానంలో ఎకరానికి నికర ఆదాయం రూ.53,140తోపాటు 15 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. సాధారణ పద్ధతిలో ఆదాయ, వ్యయ నిష్పత్తి 1:54 కాగా నూతన విధానంలో 2.23గా ఉన్నట్లు కేవీకే శాస్త్రవేత్త కె.రవికుమార్ తెలిపారు. శాస్త్రవేత్తల సూచనలతోనే తక్కువ వ్యవధిలో అధిక లాభాలు సాధించినట్లు రైతు అప్పారావు పేర్కొన్నారు.

– వైరా, న్యూస్‌టుడే

నిండా ముంచుతున్న ఎండాకు తెగులు

కూసుమంచి, న్యూస్‌టుడే



కూసుమంచిలో తెగులు సోకిన వరి పైరు

ఖమ్మం జిల్లాలో మున్నేరు, పాలేరు, ఆకేరు వరద ప్రభావిత ప్రాంతాల్లోని అన్నదాతలకు ఖరీఫ్‌లో ఆటుపోట్లు తప్పటం లేదు. అధిక వర్షాలు, ఆ వెంటనే విపరీత ఉష్ణోగ్రతల ప్రభావం కారణంగా వరిలో ఎండాకు తెగులు విజృంభిస్తోంది. ఉభయ జిల్లాల్లో అధిక వర్షాలు కురిసిన ఇతర ప్రాంతాల్లోనూ ఈ సమస్య ఉంది. రెండు నెలల క్రితం సాగు చేసిన వరి పైరు ప్రస్తుతం చిరుపొట్ట, పొట్ట దశల్లో ఉంది. పైరుపై ఆశిస్తున్న ఎండాకు తెగులు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే ఎకరాకు రూ.22-25 వేల వరకు పెట్టుబడిగా వెచ్చించిన రైతులు, ఈ తెగులు ప్రభావంతో పైరు పైనుంచి ఎండుతూ గడ్డిబారి పోతుండటంపై ఆందోళన చెందుతున్నారు. సన్న రకాలు సాగు చేసిన పొలాల్లో తెగులు ఉద్ధృతి తీవ్రంగా ఉందని చెబుతున్నారు.

నివారణ.. ఎండాకు తెగులు నివారణకు వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, శాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య పలు సూచనలు చేశారు. లక్షణాలు గుర్తించిన వెంటనే పైపాటుగా నత్రజని ఎరువు వేయడం తాత్కాలికంగా నిలిపివేయాలి. తెగులు నివారణకు ఎలాంటి మందులు లేవని గుర్తించాలి. వ్యాప్తిని నివారించడానికి రాగి ధాతు శిలీంధ్రనాశిని అయిన కాపర్ హైడ్రాక్సైడ్ 2.0 గ్రా, స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 0.4 గ్రాము ఒక లీటరు నీటికి కలిపి దుబ్బు చేసే దశలో ఉన్న వరిపైరులో పిచికారి చేయాలి. వరి పంట పూత దశలో ఉన్నప్పుడు మాత్రం కాపర్ శిలీంధ్రనాశినిని పిచికారి చేయొద్దు. సమగ్ర యాజమాన్య చర్యల్లో భాగంగా ఆఖరి దఫాగా పొటాష్ ఎరువును ఎకరానికి 15 నుంచి 20 కిలోలు వర్షాలు తగ్గాక పొలంలో చల్లాలి.

రైతేరాజు

అప్రమత్తంగా లేకుంటే అనర్థమే..

సత్తుపల్లి, న్యూస్‌టుడే



జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం అమల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 15న ప్రారంభమయ్యే టీకాలు పంపిణీ కార్యక్రమం దాదాపు నెల రోజులపాటు కొనసాగనుంది. నూరు శాతం వ్యాక్సినేషన్ వేసేలా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. టీకా సామర్థ్యం ఆరు నెలలు. అందుకే ప్రతి ఆరు నెలలకోసారి వీటిని అధికారులు మూగజీవాలకు ఉచితంగా అందిస్తున్నారు. మూడు నెలల వయసు దాటిన ప్రతి ఆవు, గేదెలకు టీకాలు వేయనున్నారు.

పనితీరుపై ప్రభావం: దేశవాళీ కంటే ఎక్కువగా సంకరజాతి పశువులపై గాలికుంటు వ్యాధి తీవ్రత ఎక్కువ. దేశవాళీ పశువుల్లో ప్రాణ నష్టం పెద్దగా లేకున్నా వ్యాధి తీవ్రత అధికం. టీకాలు వేయించకుంటే ఊపిరితిత్తుల పనితీరుపై ప్రభావంపడి పశువులు తీవ్రంగా రొప్పు రావడం, పనిచేసే సామర్థ్యం తగ్గి, పాల ఉత్పత్తి పడిపోతుంది. ఓ దశలో చిన్న పశువులు అధిక ఉష్ణోగ్రతలతో మృతి చెందే ప్రమాదం ఉంటుంది.

'వ్యాధి బారినపడ్డాక వైద్యం చేయించటం కంటే ముందే అప్రమత్తమై రైతులు తమ పశువులకు నివారణ టీకాలు వేయించాలి. ఇంటికే వచ్చి వైద్య సిబ్బంది టీకాలు వేస్తారు. దీని సదుపాయాన్ని గాలికుంటు వ్యాధి నుంచి తమ మూగజీవాలను కాపాడుకోవాలి.'



– ఎం.వెంకటేశ్వర్లు, ఏడీ, పశువైద్యశాల, సత్తుపల్లి.

లక్షణాలు ఇలా..

- పశువులు నడవలేక పోవడం, దుక్కిటెడ్లు పనులు చేసే సామర్థ్యాన్ని కోల్పోవడం.
- 103 నుంచి 106 డిగ్రీల జ్వరం రావడం.
- మూగజీవాల నోట్లో, చిగుళ్లపై పొక్కులు వచ్చి మేత, నీళ్లు తీసుకోకపోవటం. నోటి నుంచి సొంగకారడం.
- కాలు గిట్టల్లో పుండ్లుపడి పురుగులు రావడం.

ప్రశ్న జవాబు

? వరిలో సుడిదోమ ఆశించింది. నివారణ తెలపండి.. – పాపారావు, మాటూరుపేట

◆ ప్రస్తుత పరిస్థితుల్లో వరిని సుడిదోమ ఆశించడానికి వాతావరణం చాలా అనుకూలం. దీని ఉద్ధృతి తక్కువగా ఉన్నప్పుడు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాము లేదా డైనోఫ్యూరాన్ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.





? మంచి సెనగ, పులుసెనగ రకాలు తెలపండి. ఎప్పటి వరకు విత్తనం వేసుకోవచ్చు? – శేషయ్య, దొర్నకల్

◆ నంద్యాలగ్రామ్ - 452 జేజీ 11, నంద్యాల సెనగ 47 దేశీయ రకాలు అనుకూలం. సెనగ పంటను నవంబరు మొదటి పక్షం వరకు వేసుకోవచ్చు. ఇంకా ఆలస్యంగా ఉంటే పూత సమయంలో ఉష్ణోగ్రతలు ఎక్కువై దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. – మధిర, న్యూస్‌టుడే

డాక్టర్ కె.రుక్మిణీదేవి, శాస్త్రవేత్త మధిర పరిశోధన స్థానం

రైతులు తమ సందేహాలను పంపాల్సిన వాట్సప్ నెంబరు: **76750 50041**

చదువుల తల్లికి సాయమందించరూ..

సత్తుపల్లి, న్యూస్‌టుడే

☆ వైద్యవిద్యలో సీటు సాధించిన గిరి పుత్రిక

మానవీయం

వైద్యురాలిగా ఎదిగి సమాజానికి తన వంతు సేవ చేయాలన్న ఆలోచనతో బైపీసీ కోర్సును ఎంచుకుంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ యువతి నాలుగేళ్ల క్రితమే నీట్‌లో ప్రతిభ చూపినా ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ముందుకెళ్లలేకపోయింది. ఎలాగైనా వైద్యవిద్య చదవాలనే తలంపుతో ఈ ఏడాది నీట్ పరీక్ష రాసి ఎంబీబీఎస్ సీటు సాధించింది. కానీ మళ్లీ పేదరికమే ఆ విద్యార్థిని పురోగతికి ప్రతిబంధకంగా మారింది.

సత్తుపల్లి పట్టణ పరిధిలోని గుడిపాడుకు చెందిన నాయకపోడు గిరిజన దంపతులు రాజిని ప్రసాద్, నాగమణి కుమార్తె శివభార్గవి. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబంలో జన్మించిన శివభార్గవి ఐదో తరగతి వరకు స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుకుంది. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాల విద్య చదివి, ఖమ్మంలోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ గురుకుల కళాశాలలో 2020లోనే ఇంటర్ (బైపీసీ) పూర్తి చేసింది. అదే ఏడాది నీట్ పరీక్ష రాసి కేటగిరీ విభాగంలో ర్యాంక్ సాధించినా వైద్యవిద్య చదివేందుకు కావల్సిన కనీస పరిస్థితులు లేక విరమించుకుంది. కానీ ఎలాగైనా తన జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలని భావించి తల్లిదండ్రులను ఒప్పించి మళ్లీ నీట్ ప్రవేశ పరీక్ష రాసింది. కోచింగ్ సెంటర్లకు వెళ్లి కుస్తీపడితే తప్ప ప్రవేశం దొరకని కోర్సులో సీటు కోసం ఇంట్లోనే ఉంటూ యూట్యూబ్ తరగతుల సాయంతో సిద్ధమైంది. ఈ ఏడాది నీట్‌లో స్టేట్ ర్యాంకు 7,146, ఎస్టీ కేటగిరీ ర్యాంకు 567 సాధించింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో శివభార్గవికి సీటు వచ్చింది. 'ఏ' కేటగిరీ విభాగంలో ఏడాదికి రూ.2.5 లక్షల చొప్పున వైద్యవిద్యకు దాదాపు రూ.12.5 లక్షలు అవసరమవుతాయి. రీయింబర్స్ రూపంలో చాలా స్వల్ప మొత్తంలోనే మినహాయింపు ఉంటుంది. ఈ నేపథ్యంలో చదువుకోవాలన్న బిడ్డ తపనను చూస్తున్న తల్లిదండ్రులు ఏం చేయాలో తోచని స్థితిలో కుమిలిపోతున్నారు. కళాశాల రుసుములు, మెటీరియల్స్, పుస్తకాల కొనుగోలుకు సాయం అందించి తమ కుమార్తె చదువుకు అండగా నిలవాలని దాతలను వేడుకుంటున్నారు. దాతలు సంప్రదించాల్సిన నంబరు: 9394450050



తల్లిదండ్రులతో విద్యార్థిని శివభార్గవి

గిరిజన యువతకు ఉచిత శిక్షణ: పీఓ

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన గిరిజన యువతను వివిధ రంగాలలో నైపుణ్యం వచ్చేలా తీర్చిదిద్దేందుకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు పీఓ రాహుల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయసున్నవారు ఈనెల 18న ఉదయం 9 గంటలకు భద్రాచలం వైటీసీలో నిర్వహించే ఎంపిక కౌన్సెలింగ్‌కు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. టైలరింగ్‌కు కనీసం ఐదో తరగతి, బ్యూటీషియన్ తర్ఫీదు పొందేందుకు ఎనిమిదో తరగతి చదివిన యువతులు అర్హులని తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ శిక్షణకు ఎనిమిదో తరగతి చదివిన యువకులు అర్హులని వెల్లడించారు. తేనెటీగల పెంపకంలో ఆసక్తి గల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

మందారం కాదండోయ్.. ఎర్ర గోంగూర



ఈ చిత్రంలో పువ్వులను చూస్తే ఎర్ర మందారం ఎంచక్కా ఉంది కదా అనిపిస్తుంది. కానీ ఇవి మందారం పువ్వులు కావు. వైరా ఇందిరమ్మకాలనీ సమీపంలోని ఓ రైతు పొలంలో ఎర్ర గోంగూరకు పూసిన పూలు.. ఇలా మందారం పూల మాదిరిగా కనిపిస్తున్నాయి. – వైరా, న్యూస్‌టుడే

మూతపడిన ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు

నిరవధిక బంద్‌కు నిర్ణయం

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం కళాశాలలు సంపూర్ణంగా బంద్ పాటించాయి. విద్యార్థులు లేక వెలవెలబోయాయి. అధ్యాపకులు మద్దతు తెలిపారు. యాజమాన్యాలు నిరవధిక బంద్ పాటించాలని నిర్ణయించాయి. ఈ మేరకు ఆయా కళాశాలల ఎదుట ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాయి. పలు కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు కళాశాలల ఎదుట నినాదాలు చేశారు. ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కళాశాలలు మూతపడటంతో వచ్చిన విద్యార్థులు వెనుదిరిగి వెళ్లారు. మూడు సంవత్సరాల నుంచి కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవటంతో యాజమాన్యాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. సెమిస్టర్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో కళాశాలలు మూతపడటంతో విద్యార్థుల పరీక్ష ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ సందర్భంగా యాజమాన్యాల సంఘం ప్రధాన కార్యదర్శి మద్ది ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల గురించి ప్రభుత్వం, రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఇప్పటికీ దీనిపై ప్రభుత్వం స్పందించకపోవటంతో నిరవధికంగా కళాశాలలను మూసివేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ముందస్తుగా వారికి, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని టోకెన్లు ఇచ్చిన వాటికైన రీయంబర్స్‌మెంట్ చెల్లించాలని కోరారు.



ఖమ్మంలోని డీఆర్‌ఎస్ డిగ్రీ కళాశాల ఎదుట నినాదాలు చేస్తున్న కరస్పాండెంట్, అధ్యాపకులు

ప్రాంగణాలు కిటకిట.. ప్రయాణం కటకట

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: దసరా పండుగకు సొంతూళ్లకు చేరుకున్న ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో ఆది, సోమవారాల్లో బస్టాండ్లలో రద్దీ గణనీయంగా పెరిగింది. ఆర్టీసీ బస్సులు సైతం కిటకిటలాడాయి. ఫలితంగా ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూరనుంది. ప్రయాణికుల స్పందనకు అనుగుణంగా అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. రిజర్వేషన్ సదుపాయం కల్పించారు. హైదరాబాద్, మణుగూరు,



ఖమ్మం నూతన బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

భద్రాచలం, సత్తుపల్లి మార్గాల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. ఖమ్మం రీజియన్‌లో రెండు రోజుల్లో దాదాపు 328 బస్సులు అదనంగా నడిపారు. హైదరాబాద్ నుంచి 55 సిటీ బస్సులను రప్పించారు. ఖమ్మం రీజియన్ నుంచి మిగతా సర్వీసులను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి వరకూ బస్టాండ్ రద్దీగా ఉంది. మరో రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే అదనుగా కొంతమంది దొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. పాత బస్టాండులో ఓ ప్రయాణికురాలి గొలుసు అపహరించారు. ప్రయాణికుల తాకిడి నేపథ్యంలో ప్రత్యేక బస్సుల్లో అదనపు ఛార్జీలు వడ్డించారు. రూ.100 ఛార్జి ఉన్నచోట రూ.150 చొప్పున వసూలు చేశారు. యాజమాన్యం ఆదేశాల మేరకే అదనపు ఛార్జీలు తీసుకుంటున్నట్లు ప్రాంతీయ మేనేజర్ సరిరాం వివరించారు.

కానిస్టేబుల్ సాగర్‌కు నివాళి

☆ కుటుంబాన్ని ఆదుకోవాలని గిరిజన సంఘాల నిరసన
☆ ఎమ్మెల్యే, ఎస్పీ పరామర్శ

ఏన్కూరు, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఆత్మహత్యకు పాల్పడిన భూక్యా సాగర్ అంత్యక్రియలు సోమవారం రాత్రి ఆయన స్వగ్రామం ఏన్కూరులో జరిగాయి. ఈ ఏడాది జనవరిలో బూర్గంపాడులో విధులు నిర్వహిస్తున్న సమయంలో గంజాయి చోరీ ఘటనలో సస్పెన్షన్‌కు గురయ్యారు. అక్కడ కొంత మంది అధికారులు, ఓ నాయకుడు తనను అన్యాయంగా ఆ కేసులో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఈనెల 12న ఏన్కూరు సమీపంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన విషయం విదితమే. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన సాగర్ మృతదేహాన్ని ఏన్కూరు తరలించారు. మృతదేహాన్ని చూసి భార్య, పిల్లలు, తల్లిదండ్రులు బోరున విలపించారు. ప్రభుత్వం ఉద్యోగం సాధించిన కుమారుడు తమకు అండగా ఉంటాడనుకుంటే కానరాని లోకాలకు వెళ్లాడంటూ కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మధ్యాహ్నమే సాగర్ ఇంటికి చేరుకుని ఆ కుటుంబాన్ని ఓదార్చారు. అక్కడకు చేరుకున్న గిరిజన సంఘాలు, కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకున్నారు. సాగర్ ఆత్మహత్యకు కారకులైన వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. భార్య, పిల్లలకు నష్టపరిహారం ప్రకటించాలని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉన్నతాధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. మృతదేహం వచ్చే సమయానికి వివిధ రాజకీయ పక్షాలు, గిరిజన సంఘాలు, గిరిజనుల పెద్దసంఖ్యలో తరలిరావడంతో ముందస్తుగా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కొద్దిసేపటికి ఎస్పీ రోహిత్‌రాజ్ అక్కడకు చేరుకుని ఎమ్మెల్యే, ఖమ్మం డీసీపీ నరేశ్‌కుమార్‌తో కలిసి మృతదేహం వద్ద నివాళి అర్పించారు. అనంతరం గిరిజన సంఘాలతో సమావేశమయ్యారు. శాఖాపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రకటించారు. తక్షణ సాయంతో రూ.లక్ష నగదు అందజేశారు. ఎస్పీ హామీతో గిరిజన సంఘాలు, కుటుంబ సభ్యులు శాంతించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఇల్లెందు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, చంద్రబాను, పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, సీఐలు సాగర్, ముత్తిలింగం వివిధ మండలాల ఎస్సైలు పాల్గొన్నారు.



సాగర్ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు



సాగర్ ఇంటి వద్ద ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ఎస్పీ రోహిత్‌రాజ్, గిరిజన సంఘాలు, రాజకీయ నాయకులు

కానిస్టేబుల్ కొడుకుగా అండగా ఉంటా: ఎస్పీ రోహిత్‌రాజ్

ఓ కానిస్టేబుల్ కొడుకుగా తనకు ఆ కుటుంబాల బాధలు తెలుసని మృతి చెందిన సాగర్ కుటుంబాన్ని ఆదుకుంటామని ఎస్పీ రోహిత్‌రాజ్ ప్రకటించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తోపాటు గిరిజన సంఘాలు తమ దృష్టికి తెచ్చిన హామీలు పరిష్కరిస్తామన్నారు. కానిస్టేబుల్ సాగర్ భార్య విద్యార్హతకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగం, వారికి అందాల్సిన ప్రభుత్వ సాయం వచ్చే విధంగా ప్రత్యేక అధికారిని నియమిస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి



పద్దం చంటి

చంద్రుగొండ, న్యూస్‌టుడే: చంద్రుగొండ మండలం గానుగపాడు గ్రామంలో పద్దం చంటి(29) చెరువులో మునిగి సోమవారం మృత్యువాత పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని నల్లచెరువులో చేపలవేటకు మరో ఇద్దరితో కలిసి వెళ్లిన చంటి నీటిలోకి దిగాడు. లోతైన ప్రదేశంలోకి వెళ్లడంతో చంటి మునిగిపోయి మృతి చెందాడు. తోటివారి సమాచారంతో గ్రామస్థులు, కుటుంబీకులు మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చేపల వేటకు వెళ్లి...

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గౌరవరం గ్రామంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందిన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. లింగాపురం గ్రామానికి చెందిన మట్టా వీరయ్య(45) గౌరవరంలోని తన అక్క ఇంటికి ఆదివారం ఉదయం సమయంలో వెళ్లి పొలంలో కలుపు మందు పిచికారీ చేశాడు. అనంతరం మధ్యాహ్నం సమయంలో గ్రామ శివారులో ఉన్న చెరువులో చేపల వేటకు వెళ్లాడు. చేపలు పడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు నీటి లోతును అంచనా వేయలేక మునిగిపోయి మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.1.42 కోట్లకు మిర్చి వ్యాపారి ఐపీ

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం గాంధీచౌక్‌కు చెందిన మిర్చి వ్యాపారి పొన్నెబోయిన శ్రావణ్ కుమార్ రూ.1,42,00,000లకు స్థానిక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం ఐపీ దాఖలు చేశారు. మొత్తం ఏడుగురు రుణదాతలను ప్రతివాదులుగా చేర్చారు. కేసు వివరాల ప్రకారం.. పిటిషనర్ శ్రావణ్ కుమార్ 'కార్తికేయ ఎంటర్‌ప్రైజెస్' పేరుతో 2018 నుంచి ఖమ్మంలో మిర్చి వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారాభివృద్ధి కోసం ప్రతివాదుల వద్ద అప్పులు తీసుకున్నారు. కొవిడ్‌తోపాటు ఇతర కారణాల వల్ల వ్యాపారంలో నష్టాలు వచ్చాయని, తనను దివాలాదారుగా ప్రకటించాలని కోరుతూ న్యాయవాది జె.పాపారావు ద్వారా ఐపీ దాఖలు చేశారు.

రూ.29.64 లక్షలకు మరొకరు..

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం గాంధీచౌక్‌కు చెందిన మిర్చి వ్యాపారి పిల్లిగుండ్ల సురేశ్ రూ.29,64,355లకు స్థానిక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం ఐపీ దాఖలు చేశారు. మొత్తం ముగ్గురు రుణదాతలను ప్రతివాదులుగా చేర్చారు. కేసు వివరాల ప్రకారం.. పిటిషనర్ సురేశ్ 2018 నుంచి ఖమ్మంలో మిర్చి వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారాభివృద్ధి కోసం ప్రతివాదుల వద్ద అప్పులు తీసుకున్నారు. కొవిడ్‌తోపాటు ఇతర కారణాల వల్ల నష్టాలు వచ్చాయని, తనను దివాలాదారుగా ప్రకటించాలని కోరుతూ న్యాయవాది జె.పాపారావు ద్వారా ఐపీ దాఖలు చేశారు.

చెల్లని చెక్కు కేసులో ఆర్నెల్ల జైలు

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో ఖమ్మం నగరానికి చెందిన బి.సోమయ్యకు ఆర్నెల్ల జైలు శిక్షతోపాటు ఫిర్యాదుదారుడికి రూ.10 లక్షలు చెల్లించాలని ఆదేశిస్తూ స్థానిక ప్రధాన ప్రథమశ్రేణి మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి కె.దీప సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మం నగరానికి చెందిన ఫిర్యాదుదారు వంగారు నాగబాబు.. న్యాయవాది ఎస్‌కే.హైదర్ అలీ ద్వారా దాఖలు చేసిన కేసులో ఈ తీర్పు వెలువరించారు.

ముత్తంగి రూపంలో రాములోరి దర్శనం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి సోమవారం ముత్తంగి రూపంలో దర్శనమిచ్చారు. ముత్యాలతో పొదిగిన వస్త్రాలంకృతుడైన రామయ్య తండ్రి చూడముచ్చటగా కనిపించారు. సీతమ్మకు యోక్త్రధారణ రామయ్యకు యజ్ఞోపవీతధారణ కనుల పండువగా సాగింది. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రూ.లక్ష పైబడి విరాళం అందించిన దాతలకు స్వామివారి ప్రసాదం అందించి మంగళవారం సన్మానించనున్నారు.

ప్రాణం తీసిన సైకిల్ సవారీ

కడుపు భాగంలో హ్యాండిల్ తగిలి బాలుడి మృతి

మధిర పట్టణం, న్యూస్‌టుడే: దసరా సెలవులు కావటంతో స్నేహితుణ్ని ఎక్కించుకుని సరదాగా సైకిలు తొక్కుతున్న ఓ బాలుడు ప్రమాదవశాత్తు కిందపడి అస్వస్థతకు గురై మృత్యువాత పడ్డాడు. మధిర పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.. మహదేవపురం గ్రామానికి చెందిన కనపర్తి నారాయణ ఆటో డ్రైవర్. ఇతనికి కుమారుడు మనోజ్‌కుమార్(14), కుమార్తె సంతానం. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే మనోజ్ తొమ్మిదో తరగతి, అతని చెల్లి ఏడో తరగతి చదువుతున్నారు. దసరా సెలవులు కావటంతో ఈనెల 11న మనోజ్ సైకిల్‌పై తన స్నేహితుడు విక్కీని వెనక కూర్చోబెట్టుకుని తొక్కుతున్నాడు. వేగంగా వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఈ సమయంలో కడుపు హ్యాండిల్ బలంగా గుద్దుకోవటంతో అంతర్గత గాయాలయ్యాయి. నొప్పి తీవ్రం కావటంతో 12న మధిరలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. స్కానింగ్ చేసిన వైద్యులు ఖమ్మం తీసుకెళ్లాలని సూచించారు. ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో అదే రోజు బాలునికి శస్త్రచికిత్స చేశారు. పరిస్థితి విషమించి 13న సాయంత్రం బాలుడు చనిపోయాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంధ్య తెలిపారు.

జూలూరుపాడు అటవీరేంజిలో పులి సంచారం

శునకాన్ని లాక్కెళ్లి ఆరగించినట్లు నిర్ధారణ

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడు అటవీ రేంజి పరిధిలో పెద్దపులి సంచారం వాస్తవమేనని అటవీ శాఖ అధికారులు తేల్చారు. కొద్ది రోజులుగా స్థానికంగా పులి సంచరిస్తుందనే విషయంపై పలు గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్న నేపథ్యంలో తొలుత అటవీ అధికారులు పులికాదంటూ కొట్టిపారేశారు. సోమవారం జూలూరుపాడు అటవీరేంజి పరిధిలోని మున్యాతండా పంట పొలాల్లో పాదముద్రలను ఎఫ్ఆర్వో ప్రసాదరావు, సిబ్బంది వెళ్లి పరిశీలించారు. 90 శాతం పులి అడుగులను పోలి ఉన్నాయని, పెద్దపులిగానే భావించి ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఓ రైతు శునకాన్ని పొలం వద్ద కట్టేసి ఉంచగా దాన్ని గుట్టపైకి లాక్కెళ్లి తినేసిందని తెలిపారు. దీని ఆధారంగా జూలూరుపాడు-తల్లాడ అటవీ రేంజి ప్రాంతంలో అది సంచరిస్తున్నట్లు అంచనా వేస్తున్నట్లు చెప్పారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళ పొలాల వైపు వెళ్లొద్దని గ్రామాల్లో చాటింపు వేస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు రేంజిల సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తూ దాని కదలికలపై పది రోజులపాటు నిఘా పెడుతున్నామని, ప్రజలెవరూ దానికి హాని తలపెట్టొద్దన్నారు. తనకు ప్రమాదమని భావించిన సందర్భంలో పులి దాడికి పాల్పడే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు.



గుర్తించిన పాదముద్ర



పులి సంచరించిన పొలాల్లో అటవీ అధికారులు, సిబ్బంది పరిశీలన

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	5,500	7,000	6,700
పెసలు	4,000	7,350	7,350
కందులు	7,000	7,000	7,000
ఏసీ ఎండుమిరప	14,700	19,000	17,500
ఎండుమిరప	13,000	19,700	15,000
తాలుమిరప	6,000	11,000	10,000

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర • వైరా

ఎట్టకేలకు ఆర్వోబీకి మరమ్మతులు ప్రారంభం


జాయింట్ల వద్ద మరమ్మతులు చేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్మికులు

మధిర, న్యూస్‌టుడే: మధిర ఆర్వోబీపై ఎట్టకేలకు సోమవారం మరమ్మతులు ప్రారంభమయ్యాయి. దశాబ్ద కాలంగా మధిర ప్రాంత ప్రజలు ఈ ఆర్వోబీపై ప్రయాణించే సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్య పరిష్కరించేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ చూపారు. మరమ్మతులకు రూ.70 లక్షలు మంజూరు చేశారు. ఎట్టకేలకు గుత్తేదారు సంస్థ సోమవారం పనులు ప్రారంభించారు. 27 చోట్ల ఉన్న జాయింట్లకు ఇరువైపులా అరమీటరు దూరం స్లాబును బ్రేక్ చేసి మైక్రో కాంక్రీటు వేయనున్నారు. రెండు నెలలు పడుతుందని ఆర్‌అండ్‌బీ ఏఈ రాంబాబు తెలిపారు.

వైద్యవిద్య సీట్లు సాధించినవారికి సన్మానం

కల్లూరు, న్యూస్‌టుడే: వైద్యవిద్య సీట్లు సాధించిన కల్లూరు పట్టణం శాంతినగర్‌కు చెందిన కొత్తపల్లి స్వరూప, టి.ఉదయ్‌కిరణ్, నల్లగట్ల మహేతను స్థానికులు సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్రరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్కినేని రఘు, పంచాయతీ కార్యదర్శి నందిశెట్టి నాగేశ్వరరావు, ఖమ్మంపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: తల్లాడ - మల్లవరం రహదారిలో రోడ్డుకిరువైపులా కంపచెట్లు పెరగడంతో రాకపోకలకు ఆటంకంగా మారింది. **సైదులు, స్థానికుడు:**
సమాధానం: రెండు రోజుల్లో కంపచెట్లను తొలగిస్తాం. **సిద్దిక్‌మియా, కార్యదర్శి:** తల్లాడ, న్యూస్‌టుడే

గుత్తా వీరయ్య విగ్రహావిష్కరణ

వైరా, న్యూస్‌టుడే: రెబ్బవరంలోని గుత్తా వీరయ్య విగ్రహాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని ఆవిష్కరించారు. రెండున్నర సంవత్సరాల క్రితం గుత్తా వీరయ్య శ్రీకోదండ రామస్వామి దేవాలయానికి కోటి రూపాయల విలువలైన మూడున్నర ఎకరాల భూమిని దానం చేశాడు. ఆరు నెలల క్రితం వీరయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. రామాలయ కమిటీ ఆధ్వర్యంలో దేవాలయం ఎదురుగా విగ్రహం చేసి మల్లు నందిని చేత విగ్రహాన్ని ఆవిష్కరింపజేశారు. సాదం రామారావు, గుత్తా వెంకటేశ్వర్లు, పసుపులేటి మోహన్‌రావు, శీలం వెంకటరామిరెడ్డి, కొండలు, కృష్ణారావు, మురళి, రామారావు, దానియేలు, సతీష్ పాల్గొన్నారు.
✦ వైరా హనుమాన్ బజారులోని మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మల్లు నందిని పాల్గొన్నారు.


వీరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మల్లు నందిని

మల్లు నందిని పూజలు

ఎర్రుపాలెం, మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి, ఏపీలోని నెమలి శ్రీవేణుగోపాల స్వామి ఆలయాలను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మాఫౌండేషన్ ఛైర్‌పర్సన్ మల్లు నందిని సోమవారం దర్శించుకున్నారు. దేవాలయ అర్చకులు ఆమెకు స్వాగతం పలికారు. శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించారు.

గోడపత్రాలు ఆవిష్కరణ

పెనుబల్లి, న్యూస్‌టుడే: టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనానికి సంబంధించిన గోడపత్రాలను సోమవారం ఏరియా ఆసుపత్రిలో ఆవిష్కరించారు. ఇఫ్టూ జిల్లా నాయకుడు అమర్లపూడి శరత్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గంపై దాడి తీవ్రతరం అవుతోందన్నారు.

అక్కరకురాని ప్రజావాణి

మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో మూడు వారాల్లో 48 విజ్ఞాపనలే

చింతకాని, సత్తుపల్లి, న్యూస్‌టుడే

తమ సమస్యల పరిష్కారానికి పలు మండలాల్లోని ప్రజలు జిల్లా కేంద్రం దాకా వచ్చి విజ్ఞాపనలు అందించాల్సిన అవసరం లేకుండా మండల తహసీల్దార్ కార్యాలయాల్లోనే ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు విధిగా అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని నిర్దేశించారు. 'ఆరంభ శూరత్వం' అన్న తరహాలో మొదటి వారం కళకళలాడిన ప్రజావాణి ఆ తర్వాత నుంచీ వెలవెలబోతోంది. 'కర్ణుని చావుకు కారణాలనేకం' అన్నట్టు ఉన్నతాధికారుల ప్రయత్నం సఫలం కాకపోవటానికి పలు ప్రయత్న లోపాలు ఎదురవుతున్నాయి.

మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో ప్రజావాణి వెలవెలబోతోంది. ఈ నెల 14న (సోమవారం) నియోజకవర్గ కేంద్రమైన మధిరలో ఒక్క దరఖాస్తు రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. హాజరైన 20 శాఖల అధికారులు మధ్యాహ్నం వరకూ ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది. మిగిలిన మండలాల్లో అదే రోజు మొత్తంగా 15 దరఖాస్తులందాయి. ఉదాహరణకు కల్లూరు మండలాన్ని చూసుకున్నట్టయితే కేవలం మూడు దరఖాస్తులు రాగా అవన్నీ వృద్ధాప్య పింఛను కోసం అందించిన దరఖాస్తులే.

రెండు నియోజకవర్గాల్లో ఇలా

	మధిర	సత్తుపల్లి
పాల్గొన్న శాఖలు	20	18
14న ఫిర్యాదులు	8	7
ఈ నెల 7న..	6	12
గత నెల 30న..	10	5


చింతకానిలో ఫిర్యాదు స్వీకరిస్తున్న తహసీల్దార్ అనంతరాజు

రెవెన్యూలో అధికం..

రెండు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం పది మండలాలున్నాయి. వీటిల్లో గత నెల 30వ తేదీ, ఈ నెల 7, 14 తేదీల్లో కలిపి కేవలం 48 దరఖాస్తులే వచ్చాయి. ఇందులో 23 రెవెన్యూ శాఖకు సంబంధించినవే. దీర్ఘకాలంగా ధరణికి సంబంధించిన భూసమస్యలపైనే ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయి. తర్వాత స్థానాల్లో విద్యుత్తు, మండల పరిషత్తులకు సంబంధించిన విన్నపాలున్నాయి. కొన్ని శాఖలైతే బోణీనే చేయలేదు. మధిర మండలంలో మూడు వారాల్లో కేవలం మూడే దరఖాస్తులు వచ్చాయి. మండలాల్లో విన్నపాలు చేసేందుకు స్థానికులు ఆసక్తి కనబర్చటం లేదన్న విషయం దీన్నిబట్టి అర్థమవుతోంది.

రెవెన్యూ శాఖకు విజ్ఞాపనలు
మధిర: 9 సత్తుపల్లి: 14

✪ ఒక్క దరఖాస్తు రాని ప్రధాన శాఖలు: వ్యవసాయ, అటవీ, ఆబ్కారీ, విద్య, వైద్యం, ఆరోగ్యం, పశుసంవర్ధక, రవాణా, ర.భ., ఐసీడీఎస్, ఐకేపీ తదితరాలు.

ఎందుకిలా?

1. ప్రజల అవగాహన, ఆసక్తిలేమి ప్రధాన ప్రతిబంధకం. గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యుల్లో చాలామంది ఇంకా కలెక్టరేట్‌కే వెళ్లాల్సి ఉందన్న యోచనలో ఉన్నారు. అవగాహన ఉన్నవారుకూడా స్థానికంగా ఫిర్యాదు అందిస్తే ప్రయోజనం లేదన్న యోచనలో ఉండిపోతున్నారు. కలెక్టరేట్‌కు వెళ్లి ఉన్నతాధికారులకు నివేదిస్తేనే త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని బాధితుల ఆలోచన. వారికి ఎదురైన గతానుభవాలూ ఇందుకు బలం చేకూరుస్తున్నాయి.

2. వ్యక్తిగత సమస్యలతో పోల్చితే సామూహిక ఇబ్బందులు గ్రీవెన్స్ దృష్టికి రావటం లేదు. దీంతో వైద్యం, ఆరోగ్యం, రోడ్ల లాంటి శాఖల అధికారులు ఖాళీగా ఉండిపోతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ చూపితే ఆ సామాజిక ఇబ్బందులు ప్రజావాణి దృష్టికి వచ్చే ఆస్కారం ఉంటుంది.

3. నిబంధనల ప్రకారం సోమవారం స్వీకరించిన దరఖాస్తులకు శనివారం లోపు పరిష్కారం చూపాలి. తమ పరిధిలో ఎన్ని విజ్ఞప్తులు నమోదయ్యాయో మండల అధికారులు మధ్యాహ్నమే కలెక్టరేట్‌కు నివేదించాలి. మీ సమస్య పరిష్కరించామంటూ బాధితులకు సమాచారం ఇవ్వాలి. అసలు పరిష్కారానికి వీలుకాని విజ్ఞాపనలే ఎక్కువగా వస్తున్నాయని, ఉన్నతాధికారుల ప్రమేయం, విధానపర నిర్ణయాలతో ముడిపడి ఉన్న దీర్ఘకాలిక సమస్యలే ఉంటున్నాయని అధికారులంటున్నారు. ఇందులో వాస్తవం ఉన్నా, దీర్ఘకాలేతర ఇబ్బందులూ చక్కదిద్దటం లేదని బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు.

4. క్రమంతప్పకుండా మండల స్థాయి గ్రీవెన్స్ ప్రతి వారం నిర్వహించాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించి మిన్నకుంటున్నారు. వాటిల్లో వస్తున్న సమస్యలు ఏంటి? ఎన్ని పరిష్కారమవుతున్నాయి? ప్రజల అనాసక్తతకు కారణాలేంటి? అన్ని శాఖల ప్రమేయం ఎందుకు ఉండటం లేదు? ఇలాంటి వాటిపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించటం లేదు.

5. ప్రారంభంతో పోల్చితే కొన్నిచోట్ల అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయిలో హాజరు కావటం లేదు.

చెత్త తొలగింపు



కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు ప్రభుత్వ వైద్యశాల నుంచి పాత బస్టాండు వరకు జాతీయ రహదారి పక్కన చెత్త పేరుకపోయిందంటూ 'మేమున్నాం మీకు తోడుగా'లో శనివారం ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు తన సిబ్బందితో చెత్తను తొలగించారు.

'విద్యతోనే సమాజంలో మార్పు'


ఉపాధ్యాయులకు సర్వీసు మెటీరియల్ అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి తదితరులు

కల్లూరు, న్యూస్‌టుడే: విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని, విద్యాభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టిందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. కల్లూరు జూనియర్ కళాశాలలో నూతన ఉపాధ్యాయులకు సోమవారం అవగాహన, అభినందన కార్యక్రమన్ని యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో రాగమయి మాట్లాడారు. బాధ్యతాయుతంగా నాణ్యమైన విద్యను బోధించాలన్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు పాఠశాలల్లో నిర్వహించాల్సిన రికార్డులు, రిజిస్టర్ల వివరాలను తెలిపారు. నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ మెటీరియల్‌ను ఎమ్మెల్యే అందించారు. కల్లూరు ఏఎంసీ ఛైర్‌పర్సన్ బాగం నిరజాదేవి, నాయకులు పసుమర్తి చంద్రరావు, ఉపాధ్యాయ నాయకులు రాయల నాగేశ్వరరావు, విజయకుమార్ పాల్గొన్నారు.

తల్లాడ తహసీల్దార్ బదిలీ

తల్లాడ: తల్లాడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వి.రవికుమార్ సోమవారం బదిలీ అయ్యారు. 14నెలల పాటు బాధ్యతలు నిర్వహించిన రవికుమార్ ఖమ్మం అర్బన్‌కు బదిలీ అయ్యారు. ఉప తహసీల్దార్ అదనపు బాధ్యతలప్పగించారు.

క్రికెట్ విజేత లచ్చగూడెం

చింతకాని, న్యూస్‌టుడే: దసరా పర్వదినం సందర్భంగా పాతర్లపాడులో బొర్రా హరికృష్ణ మెమోరియల్ మండల స్థాయి క్రికెట్ పోటీల్లో లచ్చగూడెం జట్టు విజేతగా నిలిచింది.

ఏడీఈగా బాధ్యతల స్వీకరణ

ముదిగొండ, న్యూస్‌టుడే: ముదిగొండ ఏడీఈగా బి.రామకృష్ణారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పనిచేస్తున్న భీంసింగ్ పెనుబల్లికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణారావుకు విద్యుత్తు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో ఏడీఈలు భీంసింగ్, కిరణ్‌చక్రవర్తి, ఏఈలు శ్రీనివాస్, నారాయణ, రామారావు పాల్గొన్నారు.

'రాజకీయ జోక్యం లేకుండా కమిటీలు వేయాలి'

తల్లాడ, న్యూస్‌టుడే: రాజకీయ జోక్యం లేకుండా ఇందిరమ్మ కమిటీలు వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో శీలం సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ 15ఏళ్లుగా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదలు రాజకీయ జోక్యంతో నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. బొంతు రాంబాబు, మాదినేని రమేష్, తాతా భాస్కరరావు, అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, శీలం ఫకీరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: గుంటుపల్లిగోపవరం గ్రామానికి చెందిన పేద వైద్య విద్యార్థి మోదుగు సాధనకు అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థుల సంఘం బాధ్యులు ఎం.రాంప్రదీప్, జి.హనుమంతరావులు, ఇతరుల సహకారంతో రూ.10వేలు అందించారు.

పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ ఎన్నిక

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ ఎన్నిక సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా సగ్గుర్తి వినోద్‌కుమార్, ఉపాధ్యక్షునిగా రంజిత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇమామ్, కోశాధికారిగా తిరుపతిలను ఎన్నుకున్నారు. నూతన కమిటీని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ టీవీఎల్ఎన్ శాస్త్రి అభినందించారు.

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కమిటీ ఎన్నిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా జి.హరికృష్ణ, అధ్యక్ష, కార్యదర్శులుగా బి.శివుడు, బి.దినేష్, ఉపాధ్యక్షుడిగా జి.కుమార్, కోశాధికారిగా వి.గోపిచంద్, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ బాధ్యులను ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ శ్రీలక్ష్మీలు అభినందించారు.

ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించుకోవాలి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి రుసుం చెల్లించి ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రవిబాబు ఓ ప్రకటనలో కోరారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ పథకంపై ప్రభుత్వం దృష్టి సారించిందని, 2020లో రూ.1000 చెల్లించిన వారి దరఖాస్తులను ప్రాసెసింగ్ చేయడం ప్రారంభించామన్నారు.

ప్రజాపంథా శ్రేణుల పరామర్శ

కారేపల్లి, న్యూస్‌టుడే: విశ్వనాథపల్లిలో వడ్డె శాంతమ్మ చిత్రపటానికి సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ శ్రేణుల బృందం సోమవారం నివాళి అర్పించింది. ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి గోగినపల్లి వెంకటేశ్వర్లు, చంద్ర అరుణ, అశోక్, ఘన్సీ, రాకేష్, తేజ్యానాయక్ పాల్గొన్నారు.

ఎన్నిక: కారేపల్లి, న్యూస్‌టుడే: భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఉద్యోగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉసిరికాయలపల్లికి చెందిన రెడ్డెబోయిన వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. సోమవారం నియామక పత్రాన్ని బీవీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ నుంచి అందుకున్నారు.

వంటగిన్నెలు వితరణ

కారేపల్లి, న్యూస్‌టుడే: కారేపల్లికి చెందిన కసగాని నవాబు, లక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం రెండో కుమారుడు శ్రీనివాస్ స్థానిక గౌడ కుల సంఘానికి రూ.20 వేల వంటగిన్నెలు సోమవారం వితరణగా ఇచ్చారు.

హమాలీలకు దుస్తులు పంపిణీ

వైరా, న్యూస్‌టుడే: వైరా లయన్స్ క్లబ్ సభ్యుడు రాయపూడి నారాయణరావు కుమారుడు అయ్యప్ప పుట్టినరోజు సందర్భంగా హమాలీలకు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు.

పెద్దగోపతిలో వరి పొలాల పరిశీలన

కొణిజర్ల, న్యూస్‌టుడే: పెద్దగోపతిలో వరి క్షేత్రాన్ని వ్యవసాయ అధికారి బాలాజి సోమవారం పరిశీలించారు. వాతావరణ అధిక మార్పుల కారణంగా వరిలో ఆకు, ఎండు తెగులు వస్తుందని తెలిపారు. సస్యరక్షణ చర్యలు సూచించారు. ఏఈవో శ్రీనివాసరాజు, రైతులు పాల్గొన్నారు.

ముదిగొండ, న్యూస్‌టుడే: మాధాపురంలోని వరి పొలాలను వైరా కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త రవికుమార్, శాస్త్రవేత్త ఫణిశ్రీ, వ్యవసాయాధికారిణి సరితలు సోమవారం పరిశీలించారు. వరిపొలాల్లో బ్యాక్టీరియా, ఎండాకు తెగులు ఆశించడాన్ని గుర్తించి నివారణ చర్యలు వివరించారు.

వ్యవసాయ కార్మికుల ప్రదర్శన

వేంసూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ కూలీలకు నెలకు రూ.5వేల పింఛను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వేంసూరులో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు దండు ఆదినారాయణ ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐ చిరంజీవికి వినతి పత్రం అందజేశారు.

జాతరలో.. జనం జోష్



ఉసిరికాయలపల్లిలో శ్రీకోటమైసమ్మ జాతర సోమవారం సందడిగా సాగింది. పలు జిల్లాల భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఇసుక వేస్తే రాలనంత జనంతో ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. మరో రెండు రోజులపాటు జాతర కొనసాగనుంది. ఆలయ ఛైర్మన్ పర్సా పట్టాభి రామారావు, వేణుగోపాలచార్యులు, పగడాల మోహన్‌కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.* ఆదివారం అర్ధరాత్రి పార్కింగ్‌లో ఉంచిన గుండాల మండలం పోతిరెడ్డిగూడానికి చెందిన పి.జగదీశ్ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బాధితుడు స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశారు. – కారేపల్లి, న్యూస్‌టుడే

కోతకు గురైన రహదారి..



ఇటీవల కురిసిన వర్షాలకు తల్లాడ- అన్నారుగూడెం రోడ్డు ఇరువైపులా కోతకు గురైంది. ఈ మార్గంలో తల్లాడ, అన్నారుగూడెం గ్రామాల ప్రజలు, రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళల్లో ప్రయాణం చేయాలంటే భయపడాల్సిన పరిస్థితి. ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పీఆర్ డీఈ రాంబాబును వివరణ కోరగా త్వరలో మరమ్మతులు చేయిస్తామన్నారు. తల్లాడ, న్యూస్‌టుడే

ధాన్యానికి బోనస్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం: ఎమ్మెల్యే

సత్తుపల్లి, న్యూస్‌టుడే: రైతులు పండించిన సన్నరకం వరికి దేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా రూ.500 బోనస్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సదాశివునిపాలెంలో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఏఎంసీ ఛైర్మన్ దోమ ఆనంద్‌బాబు, ఎంపీడీవో ఆర్.నాగేశ్వరరావు, ఎంపీవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేంసూరు, న్యూస్‌టుడే: భీమవరంలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సోమవారం ప్రారంభించారు. ఐకేపీల ఆధ్వర్యంలో 13, సహకార సంఘాల ద్వారా 16 మొత్తం 29 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తహసీల్దారు రాజు తెలిపారు.

కల్లూరు, న్యూస్‌టుడే: కొర్లగూడెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ బాగం నీరజాదేవి, మండల ప్రత్యేక అధికారిణి సునీత, తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఓ రూప, ఎంపీఓ సురేష్‌బాబు, ఏపీఎం వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ, న్యూస్‌టుడే: చిరుమర్రిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారిణి విజయలక్ష్మి ప్రారంభించారు. తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఏఓ సరిత, ఏఈఓ ఇందుభవానిలు పాల్గొన్నారు.


బోనకల్లు: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల ప్రత్యేకాధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి

చింతకాని, న్యూస్‌టుడే: చింతకానిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ అనంతరాజు సోమవారం ప్రారంభించారు. ఏఓ పల్లెల నాగయ్య, పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాసరావు, ఏపీఎం తిరుమలరావు, సీసీలు పాల్గొన్నారు.

వైరా, కారేపల్లి, న్యూస్‌టుడే: వైరా మండలం గన్నవరం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి కె.సత్యనారాయణ ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏవో మంజుఖాన్, జోత్స్న, శ్యామ్‌కుమార్, వెంకటకోటిరెడ్డి, వెంకట్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
✦ కారేపల్లి మండలం మాదారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి నవీన్‌బాబు ప్రారంభించారు. ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేందర్ పాల్గొన్నారు.

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: సిరిపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు ప్రారంభించారు. తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకే..'

బోనకల్లు, న్యూస్‌టుడే: రైతులు పంటల్ని అమ్ముకునే సమయంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాటు చేస్తుందని మండల ప్రత్యేకాధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో రవికుమార్, మార్కెటింగ్ డీపీఎం దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ నిమజ్జనం

ముదిగొండ, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన దుర్గాదేవి విగ్రహాలను మున్నేరు, చెరువుల్లో సోమవారం నిమజ్జనం చేశారు. ముదిగొండలో నిర్వహించిన శోభాయాత్రలో మహిళలు, చిన్నారులు, యువకులు ఉత్సాహంగా ఆడిపాడారు.

మధిర, న్యూస్‌టుడే: మధిర పట్టణంలోని రెండు వార్డుల్లో దుర్గామాత విగ్రహాలను సోమవారం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు, డీజే పాటలతో శోభాయాత్ర కోలాహలంగా సాగింది. అనంతరం అమ్మవారిని మధిర ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనం చేశారు.


ముదిగొండలో దుర్గాదేవి విగ్రహం ఊరేగింపు

ముగిసిన బతుకమ్మ వేడుకలు

తల్లాడ, న్యూస్‌టుడే: మండలంలో బతుకమ్మ వేడుకలు సోమవారం రాత్రి ముగిశాయి. అన్నారుగూడెం, మల్లవరం, నారాయణపురం, రామానుజవరం, లక్ష్మీపురం గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. నారాయణపురంలోని శ్రీకోదండ రామాలయం ఎదుట భారీ బతుకమ్మలను ఉంచి మహిళలు కోలాట నృత్యాలతో ఆడిపాడారు. అనంతరం ట్రాక్టర్లపై ఉంచి బాణసంచా కాల్చుతూ ప్రదర్శనగా వెళ్లి స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.


మధిర: అయ్యప్పనగర్‌లోని అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు


కోదండ రామాలయం ఎదుట బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రాయల నారాయణరావుకు నివాళి

వైరా, న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ కార్యకర్త, తెలుగు యువత మాజీ అధ్యక్షుడు రాయల నారాయణరావు మృతి పార్టీకి తీరనిలోటని సొసైటీ మాజీ అధ్యక్షుడు మందడపు మధుసూదన్‌రావు అన్నారు. సోమవారం నారాయణరావు దశదినకర్మ సందర్భంగా సంతాప సభ నిర్వహించారు. కిలారు సురేందర్, ప్రదీప్ నారాయణరావు చిత్రపటానికి నివాళి అర్పించారు. మోతుకూరి వెంకటేశ్వరరావు, పూర్ణచంద్ర, రాణి, దాసు, దినేష్ పాల్గొన్నారు.

బాలపేటలో అయ్యప్ప మహాపడిపూజ


పడిపూజకు హాజరైన మాలధారులు

తల్లాడ, న్యూస్‌టుడే: బాలపేట గ్రామంలో అయ్యప్ప మహాపడిపూజను నిర్వహించారు. గ్రామానికి చెందిన పులి కృష్ణయ్య 18వ పడి సందర్భంగా ఆదివారం రాత్రి వైరా అయ్యప్పస్వామి దేవాలయ అర్చకులు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తిరువూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, వైరా, ఏన్కూరు మండలాల భకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కోదాడకు చెందిన భాస్కర్ బృందం భక్తిగేయాలను ఆలపించారు.

మధిర, న్యూస్‌టుడే: మధిరలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం చెరుపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో 41 మంది భక్తులు దీక్ష తీసుకున్నారు.

అంగన్‌వాడీల్లో ఖాళీలు.. అందని సేవలు

కొణిజర్ల, న్యూస్‌టుడే

పిల్లల శారీరక, మానసికోల్లాసానికి ఉపయోగపడే అంగన్‌వాడీ కేంద్రాల నుంచి మెరుగైన సేవలు అందడం లేదు. కేంద్రాల్లో ఖాళీలు అధికంగా ఉండటంతో చిన్నారులకు సరైన పోషకాహారం కరవైంది. కొణిజర్ల మండలంలోని ఈ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాల కొరత వేధిస్తోంది. ఆయాలు ఖాళీలు అధికంగా ఉండటంతో వారు చేసే పని కూడా కార్యకర్తలు చేయాల్సి వస్తోంది. పని ఒత్తిడి అధికంగా ఉండటంతో చిన్నారులకు సరైన వసతులు, పోషకాహారం అందించలేక సతమతమవుతున్నారు. ఉన్నతాధికారులకు ఈ సమస్య విన్నవించిన ఖాళీల భర్తీకి ఎటువంటి పరిష్కారం చూపలేకపోతున్నారు.

ఖాళీలతో సతమతం

మండలంలోని శాంతినగర్‌లో ప్రధాన అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఖాళీగా ఉండగా, కొణిజర్ల, పెద్దమునగాల, అమ్మపాలెం, శ్రీనివాసనగర్‌లో మినీఅంగన్‌వాడీ టీచర్లు లేరు. మొత్తం 74 కేంద్రాలుండగా 13 కేంద్రాల్లో ఆయాలు లేక పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమ్మపాలెం, శాంతినగర్, సాలెబంజర, గుబ్బగుర్తి, లాలాపురం, కొత్తకాచారం, కొణిజర్ల, తనికెళ్ల, ఉప్పలచెలక, గోపవరం, పెద్దమునగాల, కొణిజర్లతోపాటు మరో రెండు కేంద్రాల్లో ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పిల్లల బాగోగులు చూసేది ఆయాలే కావడం, వారు లేకపోవడంతో ఆ బాధ్యత టీచర్లపై పడి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై అనేకసార్లు మండల పరిషత్తు సమావేశాల్లో ప్రజాప్రతినిధులు తీర్మానాలు చేసిన ఇంత వరకు ఎటువంటి చర్యలు లేవు. చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలు కూడా టీచర్లు, ఆయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీచర్ల లేని కేంద్రాలను పక్క గ్రామాల వారికి బాధ్యతలు అప్పగించడంతో అక్కడ, ఇక్కడ విధులు నిర్వహించడం కష్టంగా మారింది. ఉన్నతాధికారులు దృష్టిపెట్టి ఖాళీలు భర్తీ చేస్తే సమస్యలు పరిష్కారమవుతాయి.


ఓ కేంద్రంలో చిన్నారులు...

మండలంలో ఇలా

మొత్తం కేంద్రాలు	74
చిన్నారులు	3,100
గర్భిణులు, బాలింతలు	650

మెరుగైన సేవలందిస్తాం: ఉషారాణి, ఏసీడీపీవో

ఖాళీలు ఉన్నప్పటికీ సేవలకు అంతరాయం కలగకుండా చూస్తున్నాం. ప్రభుత్వం నోటిఫికేషన్ వస్తేనే ఖాళీలు భర్తీ అవుతాయి. చిన్నారులకు, మహిళలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

అజీజ్ కుటుంబానికి పరామర్శ


అజీజ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: కూసుమంచి మండలం జీళ్లచెర్వు జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో మరణించిన అజీజ్ కుటుంబాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకొని మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జహీర్ అలీ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి 30 తుది గడువు

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని కళాశాల ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ఆరు ట్రేడుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వాక్ ఇన్ అడ్మిషన్ సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 93944 50199
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

సమస్య: బోజ్యాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని పూర్యాతండాలో గ్రామానికి నిరంతరం మోటారుకు విద్యుత్తు సరఫరా అవుతోంది. తాకితే షాక్ కొడుతోంది. టీఐపీ, పూర్యాతండా:
సమాధానం: వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో: పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం.
– కూసుమంచి, న్యూస్‌టుడే

పెద్దతండా పంచాయతీ జలగంనగర్ రోడ్డు నంబర్ 3లో వీధి దీపాలు వెలగడం లేదు. – పాఠకుడు
✔ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. – కుమార్, ఎంపీడీవో:
– ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే

నగరంలోని కవిరాజనగర్ నాలుగో వీధిలో చెత్త పేరుకుపోయిందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. సమస్యను స్థానిక జవాన్ శ్రీకాంత్‌కు తెలుపగా దాన్ని తొలగించారు.
– ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

టీఎన్జీఓ నగర కమిటీ ఎన్నిక

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: టీఎన్జీఓ ఉద్యోగుల సంఘం ఖమ్మం నగర కమిటీ ఎన్నికలు ఖమ్మంలో సోమవారం ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాయల నర్సింహారావు ప్రకటించారు. నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా చంద్ర కాని రమణ యాదవ్, కార్యదర్శిగా పోలవరపు వీరాంజనేయులు, కోశాధికారిగా కొప్పుల దిలీప్ ఎన్నికయ్యారు. మరో 12 మంది ఎండీ రఫీ, నెల్లూరి రవికుమార్, శ్వేత, ప్రసన్నకుమార్, శంకర్‌రావు, కాంతారావు, కిరణ్‌కుమార్, ఉదయ్ భాస్కర్, శ్రావణి, పృథ్వీ, పవన్‌కుమార్, ప్రవీణ్ సభ్యులుగా ఎన్నికయ్యారు. మూడు సంవత్సరాలు నూతన కమిటీ కొనసాగుతుంది. ఎన్నికైన నూతన కమిటీ ప్రతినిధులకు ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా కన్వీనర్ కొణిదెన శ్రీనివాస్, నాయకులు గంగవరపు బాలకృష్ణ, జైపాల్, దుర్గాప్రసాద్, ఆయుష్ ప్రకాశ్, రమేశ్, తాళ్లూరి శ్రీకాంత్, రాధాకృష్ణ, ముజీద్ తదితరులు పాల్గొన్నారు.


రమణ యాదవ్ వీరాంజనేయులు

దూరి వెళ్తే జైలుకే..!

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే

తొందరగా గమ్యస్థానాలకు చేరుకోవాలనే తొందరలో కొంతమంది నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ప్రమాదకరంగా పట్టాలు దాటుతూ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. ప్రాణాలకు ప్రమాదమని తెలిసినా వాహనాలతో రైల్వే గేటు కింద నుంచి దూరి వెళ్తున్నారు. జీవితం కేసుల పాలవుతోంది. ప్రమాదకర సమయాల్లో నిందితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రమాదాల నివారణకు రైల్వే అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రత్యామ్నాయంపై దృష్టి

ఖమ్మం రైల్వే లైన్ పరిధిలో పాపటపల్లి, మల్లెమడుగు, రామన్నపేట ప్రాంతాల్లో రైలు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటి నివారణకు రైల్వే శాఖ రోడ్ ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ), రోడ్ అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ)లను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించింది. ఖమ్మం ఆర్పీఎఫ్ స్టేషన్ పరిధిలోని రైల్వే లైన్‌లో నాగులవంచ, మధిర, ధంసలాపురం, రామన్నపేట, మల్లెమడుగు ప్రాంతాల్లో ఆర్‌యూబీల నిర్మాణాలను చేపడుతున్నారు. పాపటపల్లి, రామకృష్ణాపురం, గోవిందాపురం, మోటమర్రి రైల్వేస్టేషన్ల సమీపంలో ఆర్‌యూబీల ఏర్పాటుపై రైల్వే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రైల్వే ట్రాక్‌లపై వాహనదారులు ప్రయాణించకుండా 50 మీటర్ల వరకు బారికేడ్లు, ట్రెంచ్ కొట్టడం వంటి పనులు చేపడుతున్నారు.

చట్టాలపై అవగాహన

ఖమ్మం రైల్వే లైన్ చుట్టుపక్కల ఉన్న గ్రామాలు, పట్టణ పరిసర ప్రాంతాల్లో ఆర్పీఎఫ్ అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఖమ్మం ఆర్పీఎఫ్ సీఐ ఎం.శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో దారేడు, పడమటితండా, పాపటపల్లి, గండిపల్లి, కామంచికల్లు, కోయచలక, మామిళ్లగూడెం, సారథినగర్ ప్రాంతాల్లో పలుమార్లు ప్రజలను సమావేశపరిచి రైలు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. రైలుకు అడ్డుగా వస్తే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల వరకు జరిమానా విధిస్తారని హెచ్చరిస్తున్నారు.

రైల్వే గేట్ల కింద నుంచి ప్రయాణం
అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఏడాది కాలంగా నమోదైన రైల్వే ప్రమాదాలు: 5


మూసి ఉన్న ఖమ్మం గాంధీచౌక్ రైల్వే మధ్యగేటు నుంచి దూరిపోతున్న వాహనదారులు (పాతచిత్రం)

ఇవిగో ఉదాహరణలు..

- ఆగస్టులో రఘునాథపాలెం మండలం పాపటపల్లి రైల్వే గేటు కింద నుంచి ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంతో దాటి వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఇంతలో రైలు వేగంగా రావడంతో బండి వదిలేసి ప్రాణాలు దక్కించుకున్నాడు. బండి తునాతునకలైంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేయగా నిందితుడు కోర్టు చుట్టూ తిరుగుతున్నాడు.
- మేలో వైరాకు చెందిన వ్యక్తి మల్లెమడుగు రైల్వే గేటు వద్ద ద్విచక్ర వాహనంతో పట్టాలు దాటుతుండగా వందే భారత్ రైలు వచ్చింది. వాహనాన్ని వదిలేసి వచ్చేశాడు. రైలు ఢీకొని ద్విచక్ర వాహనం కాలిపోయింది. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

53 మందికి ఉద్యోగాలు

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఖమ్మం బీసీ స్టడీ సర్కిల్లో డీఎస్సీ ఉపాధ్యాయ పోటీ పరీక్ష కోసం ఉచిత శిక్షణ పొందిన వారిలో 53 మంది అభ్యర్థులు ఉపాధ్యాయ కొలువులు సాధించారని స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. 33 మంది ఎస్జీటీ, 20 మంది స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు.

భగీరథ.. నీటి వృథా!

నగరంలోని ఖానాపురం ప్రశాంతినగర్ నగర ప్రాంతంలో మిషన్ భగీరథ నీరు వృథాగా పోవడం సర్వసాధారణంగా మారింది. వాటికి మరమ్మతులు చేయకపోవడంతో నీరంతా రహదారులపైకి, ఖాళీ స్థలాల్లోకి చేరుతోంది. నగరంలోని ఖానాపురం, ప్రశాంతినగర్‌లోని పలు ప్రాంతాల్లో నీటి లీకేజీలు కొనసాగుతున్నా సిబ్బంది, యజమానులు సైతం వాటిని పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే



రహదారిపై మురుగు.. పట్టించుకోరూ?

తురకగూడెంలో మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఉన్న కాలువల్లో మట్టి పేరుకుపోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట రహదారంతా విస్తరించి ప్రవహిస్తున్నప్పటికీ పంచాయతీ బాధ్యులు పట్టించుకోవడం లేదు. అపరిశుభ్రత, దుర్వాసనతో అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. ఎంపీవో రామచంద్రారావు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – కూసుమంచి, న్యూస్‌టుడే



గుంత పూడ్చేదెన్నడో!

ఖమ్మం-కామంచికల్లు ప్రధాన రహదారి చెంత దానవాయిగూడెం వద్ద గుంత పూడ్చక వాహనదారులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. స్థానికంగా నరేశ్ కిరాణ దుకాణం ఎదుట రోడ్డు పొడవునా గుంత ఏర్పడింది. వర్షపు నీరు నిలిచి ఉన్న సమయంలో లోతు తెలియక వాహనదారులు రోడ్డు దిగి ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనదారులకు ఈ గుంత లోతు తెలిసేలా చేసేందుకు రామన్నపేటకు చెందిన ఆటో డ్రైవర్ వెంకటేశ్ సోమవారం సాయంత్రం నీరు ఎత్తిపోయడం కనిపించింది. ఇప్పటికైనా అధికారులు ఈ గుంత పూడ్చి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు, స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. – రఘునాథపాలెం, న్యూస్‌టుడే



దుర్గామాత విగ్రహ ఊరేగింపు


ప్రత్యేక రథంలో దుర్గామాత విగ్రహ ఊరేగింపు

కూసుమంచి, న్యూస్‌టుడే: చేగొమ్మలో దుర్గామాత విగ్రహ శోభాయాత్ర సోమవారం నిర్వహించారు. విగ్రహాన్ని ప్రత్యేక రథంలో ఊరేగించారు. అనంతరం గ్రామ ఊరచెరువులో నిమజ్జనం చేశారు.

పేద ప్రతిభావంతులకు ఆర్థిక సాయం

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: ప్రతిభావంతులైన పేద విద్యార్థుల విద్యా ప్రగతికి పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు చేయూతగా నిలవడం అభినందనీయమని జడ్పీ సీఈఓ దీక్షారైనా అన్నారు. ఇల్లెందు మండలం ముకుందాపురానికి చెందిన కామ వెంకటేశ్వర్లు, ఝాన్సి దంపతుల కుమార్తె యశ్విత రామగుండం వైద్య కళాశాలలో ద్వితీయ సంవత్సరం వైద్య విద్యను అభ్యసిస్తోంది. అలాగే వైరాకు చెందిన తెలగారపు శ్రీను, పద్మ దంపతుల కుమారుడు రామకృష్ణ జేఎన్‌టీయూలో ఎంసీఏ ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వీరికి ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థిక చేయూతను అందించారు. యశ్వితకు రూ.20 వేలు, రామకృష్ణకు రూ.15 వేల చెక్కులను జడ్పీ సీఈఓ దీక్షారైనా చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ పరిశ పుల్లయ్య, ఝాన్సి పాల్గొన్నారు.


యశ్విత, రామకృష్ణకు చెక్కు అందజేస్తున్న జడ్పీ సీఈఓ దీక్షారైనా, చిత్రం ట్రస్టు ఛైర్మన్ పుల్లయ్య

బాలికల రక్షణ చట్టాలపై అవగాహన అవసరం

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: బాలికలు బాల్య దశ నుంచే వారి రక్షణ కోసం ఉన్న వివిధ వ్యవస్థలపై అవగాహన ఏర్పరచుకోవాలని జిల్లా న్యాయ సేవాసంస్థ న్యాయవాది మామిడి హనుమంతరావు అన్నారు. ఖమ్మం నగరం ఇల్లెందు క్రాస్‌రోడ్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలికల అక్రమ రవాణా, సమాజంలో ఆడ పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలపై నిత్యం జాగరూకతతో ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మాధవరావు, సత్యార్థి ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త కె.శ్రీనివాస్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయ సేవాసంస్థ న్యాయవాది హనుమంతరావు

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం గ్రామీణం: మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం అధ్యాపక పోస్టుకు తాత్కాలిక ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసశర్మ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

డిప్యూటేషన్ రద్దు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఏఈ శ్యామ్‌మనోహర్‌ను మాతృశాఖకు పంపుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని పుర, నగరపాలకాల్లో పని చేస్తున్న గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్ల డిప్యుటేషన్‌ను రద్దు చేసిన నేపథ్యంలో ఏఈని వెంటనే విధుల నుంచి విడుదల చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యటన

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: వైరా కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త కె.రవికుమార్, శాస్త్రవేత్త ఫణిశ్రీ, ఏఓ అరుణకుమారి సోమవారం చెన్నారం, రాజేశ్వరపురంలోని వరి పొలాలను పరిశీలించారు. ఎండాకు తెగులు, సుడిదోమ ఆశిస్తున్నట్లు గుర్తించి రైతులకు పలు సూచనలిచ్చారు.

ట్రాఫిక్ ఏసీపీకి సీపీఎం వినతి

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: బాలాజీ నగర్ పాత సీపీఎం కార్యాలయం రోడ్డును వన్ వే చేయాలని కోరుతూ సీపీఎం రెండో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ బి.శ్రీనివాసులుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ మాట్లాడుతూ.. నగర బస్టాండు, రైల్వేస్టేషన్, కమాన్‌బజార్ వెళ్లేందుకు పాత సీపీఎం కార్యాలయం రహదారి ప్రధాన రోడ్డుగా ఉందని, నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నట్లు తెలిపారు. చర్యలు తీసుకుంటామని ఏసీపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెండో పట్టణ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, ఉపేందర్, భద్రం, సాగర్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నేలకొండపల్లి: ఐకేపీ ఆధ్వర్యంలో చెర్వుమాదారం గ్రామంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ మాణిక్‌రావు, ఎంపీడీవో యర్రయ్య, ఏపీఎం అశోకరాణి పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: జల్లేపల్లి, జూపెడ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దారు వెంకటరామకృష్ణ సోమవారం ప్రారంభించారు. ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఏఓ సీతారామిరెడ్డి, ఏపీఎం అలివేలుమంగ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కూసుమంచి, న్యూస్‌టుడే: జీళ్లచెర్వు ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వెళ్లిన వారంతా కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్ధక్యంలో ఉన్న తమ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు నివాసానికి వెళ్లి సన్మానించారు. అప్పటి ఉపాధ్యాయులు రాజయ్య, సీతారాం, అనితలను వేదికపై సన్మానించారు.

నగరంలో సినిమాలు.. శ్రీనివాస: వేట్టయన్, సీఎన్ సినీ గెలాక్సీ: మా నాన్న సూపర్ హీరో శ్రీ తిరుమల: దేవర పార్ట్-1, వినోద: జనక అయితే గనక, శ్రీసాయిరాం: విశ్వం, కేపీఎస్: మార్టిన్, జోకర్(రెండు ఆటలు)

ప్రజల ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి: శ్రీజ

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పాడిశెట్టి శ్రీజ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరు తక్కువగా నమోదు కావటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టరేట్ భవనంలోని అన్ని శాఖల ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కావాలని, బయోమెట్రిక్ హాజరు నమోదు కావాలని ఆదేశించారు. ప్రతి శాఖ జిల్లా అధికారి ఉద్యోగుల హాజరు పర్యవేక్షించాలన్నారు. మండలాల వారీగా ప్రజావాణిలో అందిన దరఖాస్తులు, వాటి పరిష్కారం, శాఖలవారీగా పెండింగ్ వివరాలు అడిగి తెలుసుకుని సత్వరం పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఆర్డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

త్వరితగతిన పరిష్కరించండి: కమిషనర్

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రజావాణికి వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య సిబ్బందికి సూచించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కొన్ని సమస్యలు మళ్లీ మళ్లీ వస్తున్నాయని, అవి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రణాళిక, రెవెన్యూ విభాగ సమస్యలు అధికంగా వస్తున్నందున వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, డీసీపీ వికాస్, ఈఈ కృష్ణలాల్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

విశ్రాంత ఉద్యోగికి నివాళి

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: వి.వెంకటాయపాలేనికి చెందిన విశ్రాంత ఉద్యోగి రాపర్తి ప్రసాద్(69) మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. బీసీ బాలుర వసతి గృహంలో దీర్ఘకాలంపాటు వంట మాస్టర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేశారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, సీపీఐ నాయకుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తదితరులు నివాళులర్పించారు.



'కార్మిక వర్గంపై పెరిగిన దాడి'

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గంపై దాడి తీవ్రతరం అవుతోందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) ఖమ్మం ఏరియా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 20న హైదరాబాద్‌లో జరిగే టీయూసీఐలో ఇఫ్టూ విలీన సభ గోడ పత్రికలను నగరంలోని బైపాస్‌రోడ్డులో సోమవారం ఆవిష్కరించారు. ప్రధాని మోదీ ఫాసిస్టు విధానాలతో కార్మిక వర్గం ఇబ్బందులు పడుతోందని, కార్మిక ఐక్యతకు సమష్టి ఉద్యమానికి ఈ విలీన సభ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు ఎం.లక్ష్మీనారాయణ, నాయకులు రమేశ్, వెంకన్న, శ్రీను, రవి, తిరపయ్య, నాగరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ధర్నా


ధర్నా చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఎఫ్‌సీఐ హమాలీలపై కొందరు దౌర్జన్యం చేస్తున్నారని ఐఎన్‌టీయూసీ జిల్లా, నగర అధ్యక్షుడు కొత్తా సీతారాములు, నరాల నరేశ్ మోహన్ నాయుడు ఆరోపించారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద హమాలీలకు మద్దతుగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాజకీయ పార్టీలను అడ్డుపెట్టుకొని కొందరు హమాలీలను వేధిస్తున్నారని తెలిపారు. గుర్తింపు కార్డులు ఉన్నా లోపలికి అనుమతించడం లేదని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీవై పాష, కార్యదర్శి గజ్జి సూర్యనారాయణ, హమాలీ సంఘం అధ్యక్షుడు కలిమేళ భద్రం, ఎండీ ఫజల్, సైదుబాబు, జానయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెంది గడ్డి మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఖమ్మం మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ రమేశ్ కథనం ప్రకారం.. శ్రీనివాసనగర్‌లో నివసించే గంటల నరసింహాచారి కుమారుడు ధనుంజయాచారి(24) బాల్యం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెందిన అతను సెప్టెంబరు 26న గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు. తండ్రి నరసింహాచారి ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బస్సు ఎక్కుతుండగా గొలుసు చోరీ

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: బస్సు ఎక్కుతుండగా వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన ఖమ్మం పాత బస్టాండులో సోమవారం జరిగింది. ఖమ్మం ఒకటో పట్టణ పోలీసుల కథనం ప్రకారం... నేలకొండపల్లి మండలం చెరువుమాధారానికి చెందిన కాటం కోటమ్మ ఖమ్మం నగరంలో ఉంటున్న కుమార్తె ఇంటికి వచ్చి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైంది. బస్సు ఎక్కుతున్న సమయంలో రద్దీలో నుంచి ఎవరో ఆమె మెడలోని సుమారు 4.5 తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. సంఘటన స్థలంలో ఒక పుస్తె దొరికింది. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. బస్టాండులోని సీసీ కెమెరాల్లో నమోదైన వివరాలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

క్వారీ గుంత కాచుకోనుంది!

కూసుమంచి, న్యూస్‌టుడే: ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఖమ్మం-సూర్యాపేట రహదారిలో కూసుమంచి నుంచి పోచారం, తిరుమలాయపాలెం మండలం బీరోలు మీదుగా ఖమ్మం-వరంగల్‌కు చేరే రెండు ప్రధాన రహదారులకు అనుసంధాన రహదారి ఇది. పోచారం సమీపంలో రహదారి వారగా 50 అడుగుల లోతులో పెద్ద క్వారీ గుంత నిండా నీరు చేరింది. ఇటీవల అదే ప్రాంతంలో వరదలతో ఆరు అడుగుల మేర రహదారి కోతకు గురైంది. పైగా అది మలుపు ప్రాంతం. ఊహించుకుంటేనే ఒళ్లు గగుర్పాటుకు గురవుతోంది. ప్రమాదకర పరిస్థితులు నెలకొని నెలరోజులవుతున్నా సంబంధిత శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టకపోగా.. కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. కిష్టాపురం సమీపంలోనూ లో లెవెల్ చప్టా వద్ద రహదారి వరద ప్రభావంతో కోతకు గురైంది. 'న్యూస్‌టుడే' ఆర్ అండ్‌బీ ఏఈ దేవేందర్ దృష్టికి తీసుకెళ్లగా.. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాగానే మరమ్మతులు చేపడతామని తెలిపారు. తక్షణమే సూచికలు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.


కూసుమంచి మండలంలోని పోచారం సమీపంలో ఇలా


కిష్టాపురం సమీపంలో కోతకు గురైన రహదారి


వివరాల నమోదుకు గుమిగూడిన డీలర్లు

పీఓఎస్ యంత్రాల్లో వివరాల నమోదు

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: ఎరువుల విక్రయానికి సంబంధించి పాయింట్ ఆఫ్ సేల్(పీఓఎస్) మిషన్లలో విక్రయదారుల వివరాల నమోదు కార్యక్రమం సోమవారం చేపట్టారు. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం రైతు వేదికలో ఏడీఏ వాసవిరాణి, ఏఓ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది క్రిబ్‌కో ఎరువులకు సంబంధించి ఖమ్మం, వైరా, కూసుమంచి డివిజన్లకు చెందిన ఎరువుల డీలర్ల వివరాలను నమోదు చేశారు. విక్రయదారు పేరు, చిరునామా, లైసెన్సు, పాన్‌కార్డు వంటి వివరాలను యంత్రాల్లో అప్‌డేట్ చేశారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల నుంచి వచ్చిన డీలర్లతో రైతు వేదిక కిటకిటలాడింది. ఎరువుల డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లఖండం నాగేంద్రం, సెక్రటరీ చౌదరి, ఖమ్మం, వైరా, కూసుమంచి డివిజన్లకు చెందిన ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.